జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
NIZAMABAD EDITION

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

నిజామాబాద్ మంగళవారం 21 జూలై 2026 సంపుటి : 16 సంచిక : 163 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆషాఢ మాసం, గ్రీష్మ ఋతువు, దక్షిణాయనం విశేషం: పుష్యమి కార్తె సూర్యోదయం: 5:36 । సూర్యాస్తమయం: 6:31 చంద్రోదయం: 11:52 । చంద్రాస్తమయం: 11:44 తిథి: శుద్ధ సప్తమి ఉ. 7:04 వరకు, తదుపరి అష్టమి నక్షత్రం: చిత్త రా. 12:08 వరకు, తదుపరి స్వాతి యోగం: సిద్ధం రా. 10:28 వరకు, తదుపరి సాధ్యం కరణం: వణిజ ఉ. 7:04 వరకు, తదుపరి భద్ర రా. 7:18 వరకు, తదుపరి బవ

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# వ్యూహం లేని ప్రజా పాలన



- ఇప్పటికే వరి నాట్లు వేసిన సగం మంది రైతులు..
- ఎకరం నారుమడికి రూ.5వేలు పెట్టుబడి వ్యయం
- నాట్లకు మరో రూ.5వేలు వెచ్చించిన అన్నదాతలు
- ప్రత్యామ్నాయ పంటలు

నిజామాబాద్,

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల సంక్షేమం పట్టడం లేదు. అన్నదాతల విషయంలో సరైన అవగాహన కొరవడింది. జూన్ నెల ప్రారంభంతోనే వానాకాలం మొదలైంది. మరో పది రోజుల్లో వానాకాలం సీజన్ మొదలై రెండు నెలలు పూర్తవుతుంది. ఇప్పటికే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో సగానికి ఎక్కువ మంది రైతులంతా వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. వరి నాట్లు సైతం పూర్తి చేసుకున్నారు. క్వింటాకు రూ.500 బోనస్ ఆశతో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఆంక్షల మేరకు ఏడు రకాల వంగడాలనే సాగు చేసేందుకు సిద్ధం అయ్యారు. నారుమడులు వేసుకునేందుకు ఎకరానికి దాదాపుగా రూ.5వేలు వెచ్చించారు. ఎకరానికి వరి నాట్లు పూర్తి చేసేందుకు మరో రూ.5వేలు వరకు పెట్టుబడి పెట్టారు. ఇలా ప్రతి రైతు ఒక ఎకరంలో వరి నాట్లకు దాదాపుగా రూ.10వేలు వెచ్చించిన తర్వాత ప్రభుత్వం ముందుకు వచ్చి నీతి సూక్తులు చెబుతోంది. రెండు నెలల సాగు కాలం పూర్తవుతోన్న ఈ సమయంలో సమీక్షలు, సమావేశాల నిర్వహించడంపై రైతులు మండిపడుతున్నారు. నారుమడులు వేయక ముందు చెప్పాల్సిన సూక్తులు... ఆలస్యంగా చెప్పడం ఏమిటి? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా వానాకాలం పంటల సాగు అంచనాల్లో వ్యవసాయ శాఖ సైతం భారీగా వరి సాగవుతుందని అంచనాలు వేసింది. ఉమ్మడి జిల్లాలో 11లక్షల ఎకరాల్లో సాగు భూముల్లో పంటలు సాగైతే 60నుంచి 70శాతం వరి సాగయ్యే వీలున్నట్లుగా గణాంకాల్లో వెల్లడించారు. తీరా ఇప్పుడు వ్యవసాయ శాఖతో పాటుగా ప్రభుత్వ పెద్దలంతా కలిసి ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి పెట్టాలంటూ రైతులను కోరుతుండటం విడ్డూరంగా మారింది. ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమకమైన తర్వాత సీతక్క అడపా దడపా వస్తున్నారు. పూర్తి స్థాయిలో ఉమ్మడి జిల్లా పరిపాలనపై దృష్టి సారించడం లేదన్న అపవాదు సీతక్కను వెంటాడుతోంది. గతంలో ఇన్‌ఛార్జి మంత్రిగా జూపల్లి కృష్ణారావు ఉన్నప్పుడు కనీసం నెలకో, రెండు నెలలకో నిజామాబాద్, కామారెడ్డి జిల్లా వైపు చుట్టపు చూపుకైనా వచ్చి వెళ్లేవారు. జూలై నెల ప్రారంభంలో అధికారిక కార్యక్రమాల్లో సీతక్క పాల్గొన్నారు. వ్యవసాయ శాఖపై రివ్యూ మీటింగ్‌కు ఇన్‌ఛార్జి మంత్రిగా పాల్గొనాల్సి ఉండగా గైర్హాజరు అయ్యారు. ఉమ్మడి జిల్లాకు మంత్రి లేరు. ఈ సమయంలో ఇన్‌ఛార్జి మంత్రికి కీలక బాధ్యతలు ఉన్నాయి. ఎల్‌నినో వంటి ఉపద్రవం పొంచి ఉన్న ఈ సమయంలో సంబంధిత శాఖలకు కీలక ఆదేశాలు జారీ చేయాల్సి ఉండగా ప్రభుత్వ సలహాదారుడు, పీసీసీ చీఫ్ సమక్షంలోనే రివ్యూ మీటింగ్ ముగిసింది. సమావేశంలో ప్రత్యామ్నాయ పంటలపై చర్చ జరిగింది. కొంత మంది రైతులు వారి అభిప్రాయాలను పంచుకున్నారు. సమీకృత వ్యవసాయం, ఆరుతడి పంటల సాగు, సేంద్రియ వ్యవసాయంతో లాభాలు పొందవచ్చని రైతులు అభిప్రాయపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వంలో మొదలైన ఆయిల్‌పాం సాగుపై రైతులు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్ రెడ్డి అనేక మార్లు నొక్కి చొప్పారు. ఆయిల్‌పాం సాగుతో దీర్ఘకాలికంగా లాభాలు వస్తాయని అభిప్రాయం వెలిబుచ్చారు. సాగు నీటి కొరత నేపథ్యంలో వరి నాట్లు వేసిన వారికి పరిహారం అందిస్తే తక్షణం ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్తామంటూ అనేక మంది రైతులు కోరుతున్నారు. రైతుభరోసా, బోనస్ అమలుకే మొండి చేయి చూపిస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈమేరకు పరిహారం ఇవ్వడం కష్టమేనన్న అభిప్రాయం వెలుగు చూస్తోంది. ప్రజాపాలనలో అస్తవ్యస్త నిర్ణయాలు, అవగాహన లోపాలు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని భారత వాతావరణ సంస్థతో పాటుగా అనేక అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఏప్రిల్ నుంచే హెచ్చరికలు జారీ చేస్తోంది. నీటి కొరతతో కరువు తాండవించే ప్రమాదం ఉన్నట్లుగా నాలుగైదు నెలల నుంచి ప్రభుత్వానికి ఐఎండీ హెచ్చరిస్తోంది.

# కళాశాల సమయాల్లో బస్సులు ఆపకపోవడంతో రోడ్డెక్కిన విద్యార్థులు



- లింగయ్యపల్లి--కొటాలపల్లి విద్యార్థుల ఆందోళనకు ఫలితం
- రాజంపేట మండలం వరకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక బస్సులు నడుపుతామని డిపో మేనేజర్ హామీ
- దేవునిపల్లి ఎస్ఐ రంజిత్ సమక్షంలో చర్చలు..
- రేపటి నుంచే ప్రత్యేక బస్సు పంపిస్తామని అధికారుల ప్రకటన

## విద్యార్థులకు సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలి



# గర్గుల్‌లో రెండు మహిళా సంఘ భవనాలకు భూమిపూజ



కామారెడ్డి మండలంలోని గర్గుల్ గ్రామంలో మహిళా సాధికారతకు మరింత ఊతమిచ్చేలా ప్రభుత్వం మంజూరు చేసిన రెండు మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులకు సోమవారం గ్రామ సర్పంచ్ చింతల దివ్య రవితేజ గౌడ్ భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. మహిళా సంఘాలకు శాశ్వత భవనాలు అందుబాటులోకి రావడం వల్ల సమావేశాలు, పొదుపు కార్యకలాపాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ రెండు మహిళా సంఘ భవనాలు గ్రామానికి మంజూరు కావడంలో డీసీసీ కార్యదర్శి రవితేజ గౌడ్ చేసిన ప్రత్యేక కృషిని గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు ప్రశంసించారు. గ్రామ అభివృద్ధి పట్ల ఆయన చూపుతున్న చొరవ వల్ల వరుసగా అభివృద్ధి పనులు గ్రామానికి వస్తుండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సభ్యులు ఈ సందర్భంగా డీసీసీ కార్యదర్శి రవితేజ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ దివ్య రవితేజ గౌడ్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సంఘ భవనాలు మహిళల కార్యకలాపాలకు కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా చేపట్టి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

# డీఈఓ ఆదేశాలకు విరుద్ధంగా అదనపు పరీక్ష ఫీజుల వసూళ్లు? ..బీర్కూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలపై తల్లిదండ్రుల ఆందోళన

**బాన్సువాడ ఆర్సి, జూలై 20 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజుల పేరుతో అదనపు మొత్తాన్ని వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. జిల్లా విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం 9వ, 10వ తరగతి కామన్ ఎగ్జామినేషన్ బోర్డు పరీక్షలకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.130 మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా, పాఠశాలలో రూ.250 చొప్పున వసూలు చేస్తున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా ప్రైవేటు పాఠశాలల తరహాలో అదనపు ఫీజులు వసూలు చేయడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణయించిన ఫీజుకు అదనంగా రూ.120 వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని వారు అంటున్నారు. ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారిని వివరణ కోరగా, రూ.120 అదనంగా వసూలు చేసిన విషయం వాస్తవమేనని తెలిపారు. పాఠశాల శానిటైజేషన్, ఇతర నిర్వహణ ఖర్చుల నిమిత్తం తీర్మానం చేసి ఆ మొత్తాన్ని వసూలు చేసినట్లు ఆయన వెల్లడించారు. అయితే, జిల్లా విద్యాశాఖ ఆదేశాలకు విరుద్ధంగా అదనపు ఫీజులు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమో ఉన్నతాధికారులు విచారణ జరిపి స్పష్టత ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు




# గర్గుల్‌లో రెండు మహిళా సంఘ భవనాలకు భూమిపూజ





**సర్పంచ్ దివ్య రవితేజ గౌడ్ చేతుల మీదుగా ప్రారంభం**

**డీసీసీ కార్యదర్శి రవితేజ గౌడ్ కృషితో మంజూరు కావడంపై హర్షం**

**కామారెడ్డి ప్రతినిధి, జూలై 20 (ప్రజా జ్యోతి):** కామారెడ్డి మండలంలోని గర్గుల్ గ్రామంలో మహిళా సాధికారతకు మరింత ఊతమిచ్చేలా ప్రభుత్వం మంజూరు చేసిన రెండు మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులకు సోమవారం గ్రామ సర్పంచ్ చింతల దివ్య రవితేజ గౌడ్ భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. మహిళా సంఘాలకు శాశ్వత భవనాలు అందుబాటులోకి రావడం వల్ల సమావేశాలు, పొదుపు కార్యకలాపాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ రెండు మహిళా సంఘ భవనాలు గ్రామానికి మంజూరు కావడంలో డీసీసీ కార్యదర్శి రవితేజ గౌడ్ చేసిన ప్రత్యేక కృషిని గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు ప్రశంసించారు. గ్రామ అభివృద్ధి పట్ల ఆయన చూపుతున్న చొరవ వల్ల వరుసగా అభివృద్ధి పనులు గ్రామానికి వస్తుండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సభ్యులు ఈ సందర్భంగా డీసీసీ కార్యదర్శి రవితేజ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ దివ్య రవితేజ గౌడ్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సంఘ భవనాలు మహిళల కార్యకలాపాలకు కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా చేపట్టి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రవీణ్, వార్డు సభ్యులు ఎల్లవ్వ, లింబవ స్వామి, శ్రీనివాస్, శ్యామ్, కిషోర్, రాజేష్, గ్రామ పెద్దలు బి. శంకర్ గౌడ్, నరసింహులు, శ్యాంప్రకాష్, అశోక్ రెడ్డి, ఏసు స్వామి, గోవర్ధన్, నిస్సి, సిద్ధిరాములు, బచ్చు, గంగారాం స్వామి, గంగారెడ్డి, హారిక, రూప, భూదేవి, ఉమారాణి, సుజాతతో పాటు మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం మహిళా సంఘ భవనాల నిర్మాణం త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

# బ్యాంక్ ఆఫ్ బరోడా 119వ ఆవిర్భావ దినోత్సవం






**సందర్భంగా సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమం**

**ఓటీపీ, బ్యాంకు వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దు**

**సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయండి: జిల్లా పోలీసు శాఖ**

**కామారెడ్డి ప్రతినిధి, జూలై 20 (ప్రజా జ్యోతి):** బ్యాంక్ ఆఫ్ బరోడా 119వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో సోమవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోజురోజుకు పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ లావాదేవీలలో జరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కామారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు సైబర్ నేరాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సవివరంగా వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కూడా కొత్త కొత్త పద్ధతుల్లో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, రిజర్వ్ బ్యాంక్, ఆదాయపు పన్ను శాఖ, కస్టమర్ కేర్ ప్రతినిధుల పేరుతో ఫోన్ చేసి ఓటీపీ ఏటీఎం పిన్, సీవీవీ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్, పాన్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని హెచ్చరించారు. బ్యాంకు అధికారులు గానీ, పోలీసు అధికారులు గానీ ఎప్పుడూ ఓటీపీ లేదా వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అడగరని స్పష్టం చేశారు. తెలియని వ్యక్తులు పంపే లింకులు క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, బహుమతులు, లాటరీలు, ఉద్యోగాల పేరుతో వచ్చే సందేశాలను నమ్మడం వల్ల ఆర్థిక నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే నకిలీ ప్రకటనలు, పెట్టుబడి పేరుతో వచ్చే ఆఫర్లు, ఫేక్ లోన్ యాప్‌లు, క్యూఆర్ కోడ్ స్కామ్‌లు వంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, అలాగే www.cybercrime.gov.in పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112 నంబర్లకు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన డబ్బును తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుళు రామంచ తిరుపతి, శేషరావు, పోలీస్ కానిస్టేబుల్ సాయిలు మాటలు, పాటలు, నాటికల రూపంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారి ప్రదర్శనలు అక్కడికి వచ్చిన ఖాతాదారులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సులభమైన భాషలో ప్రజలకు అర్థమయ్యే విధంగా సైబర్ మోసాల పద్ధతులు, వాటి నుంచి రక్షణ మార్గాలను వివరించారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ రాజేందర్, బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ మేనేజర్, బ్యాంకు అధికారులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఐఓబీ బ్యాంక్ ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉంటేనే ఆర్థిక మోసాలను అరికట్టవచ్చని, ప్రతి ఒక్కరూ ఈ సమాచారాన్ని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడా తెలియజేసి సమాజంలో అవగాహన పెంచాలని పోలీసులు పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో బ్యాంకు అధికారులు జిల్లా పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల భద్రత కోసం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారూ

# లోలం గ్రామంలో పంటల వైవిధ్యీకరణ అవగాహన సమావేశం





**ఇందల్‌వాయి( ప్రజా జ్యోతి )** ఇందల్వాయి మండలంలోని లోలం గ్రామంలో రైతులకు ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణ పై అవగాహన సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రస్తుత వానాకాలంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా వర్షాధార పంటలైన కందులు ( రెడ్ గ్రామ్ ), సజ్జలు ( బంజారా), మొక్కజొన్న ( మ్యాజి ) వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ పంటలు తక్కువ వర్షపాత పరిస్థితుల్లో కూడా మెరుగైన దిగుబడిని అందించే అవకాశం ఉండటంతో పాటు రైతులకు ఆర్థికంగా కూడా ప్రయోజనకరంగా ఉంటాయని వివరించారు. రైతులు స్థానిక వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం మరియు వ్యవసాయ శాఖ సూచనలను అనుసరించి పంటలను ఎంపిక చేసుకోవాలని, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోలం రామకృష్ణ గౌడ్, ఉప సర్పంచ్ రవి, వ్యవసాయ విస్తరణ అధికారి (ూజుూ) లోలం క్లస్టర్ మనోజ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్గొని రైతులకు పంటల వైవిధ్యీకరణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సమావేశంలో గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పంటల ఎంపిక, సాగు విధానాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు..

# ఇంటింటికీ ఆరోగ్య పరీక్షలు.. బరంగెడిగిలో జ్వర సర్వే శిబిరం విజయవంతం

**– ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం: ఎంఎల్‌హెచ్‌పి ప్రీతి**





**బాన్సువాడ ఆర్సి, జూలై 20 (ప్రజా జ్యోతి):** బైరాపూర్ సబ్‌సెంటర్ పరిధిలోని బరంగెడిగి గ్రామంలో సోమవారం సమగ్ర జ్వర సర్వేతో పాటు ఇంటింటికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గ్రామ ప్రజల్లో జ్వరం, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులను ముందస్తుగా గుర్తించి తగిన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఎల్‌హెచ్‌పి ప్రీతి తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు ఉన్న వారిని గుర్తించారు. అనుమానిత జ్వర బాధితుల నుంచి మలేరియా నిర్ధారణ కోసం రక్త స్మియర్ నమూనాలను సేకరించారు. అలాగే అర్హులైన వారికి రక్తపోటు (బీపీ), రక్తంలో చక్కెర (జీఆర్‌బీఎస్), హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గురునాథ్, ఎంఎల్‌హెచ్‌పి ప్రీతి, ఏఎన్ఎంలు జాన్సి, కావ్య, ఆశ కార్యకర్తలు చైతన్య, మారుబాయి, ల్యాబ్ టెక్నీషియన్ విట్టల్ పాల్గొన్నారు. గ్రామస్థులను ఆరోగ్య పరీక్షలకు ప్రోత్సహిస్తూ ఆరోగ్య అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వరం లేదా ఇతర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు విశేషంగా సహకరించారు.

# అమ్మవారి విగ్రహంతో కాల్వలోకి తేజస్విని

**హైదరాబాద్ :** నగరంలో కలకలం రేపిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తేజస్విని మృతి కేసు దర్యాప్తులో అత్యంత విచిత్రమైన, ఊహించని మలుపులు వెలుగులోకి వస్తున్నాయి. చెరువులో దూకి ప్రాణాలు కోల్పోయిన తేజస్విని.. చనిపోయే ముందు ఒక గుడిలోని అమ్మవారి విగ్రహాన్ని తనతో పాటు తీసుకెళ్లినట్లు తేలడంతో పోలీసులు ఇప్పుడు ఆ విగ్రహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. తేజస్విని తన దుస్తులు విప్పేసి, దిగంబరంగా సమీపంలోని ఒక గుడిలోకి ప్రవేశించింది. అక్కడ ఉన్న అమ్మవారి విగ్రహాన్ని చేతుల్లోకి తీసుకుని నేరుగా సమీపంలోని చెరువు వైపు నడిచి, నీటిలోకి దూకింది. ఆ తర్వాత ఆమె మృతదేహం లభ్యమవగా, ఆమె తీసుకెళ్లిన విగ్రహం మాత్రం ఇంకా దొరకలేదు. ఈ కేసులో ఆ విగ్రహం కీలక ఆధారంగా మారే అవకాశం ఉండటంతో, డీఆర్ఎఫ్ సిబ్బంది బోట్ల సహాయంతో చెరువులో విగ్రహం కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ దర్యాప్తులో తేజస్విని ఉంటున్న నివాసానికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. ఆమె ఒక అద్దె ఫ్లాట్‌లో ఉంటున్నట్లు, దానికి రోజుకు రూ. 3,500 చొప్పున నెలకు దాదాపు రూ. లక్ష వరకు అద్దె చెల్లిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా, ఆమె ఉంటున్న భవనంలోని పై రెండు అంతస్తులను అక్రమంగా ఒక లాడ్జిలా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.

# భవన నిర్మాణ కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

**లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి**

**జీవో నెం.12 సవరించి సంక్షేమ పథకాలను వెల్ఫేర్ బోర్డు ద్వారానే అమలు చేయాలి:**

**సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్**

**జిల్లా కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికుల ధర్నా..**

**అడిషనల్ కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం**



**కామారెడ్డి ప్రతినిధి, జూలై 20 (ప్రజా జ్యోతి):** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి భంగం కలిగించే విధంగా తీసుకొస్తున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, 1996 భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.12ను వెంటనే సవరించి, సంక్షేమ పథకాలను ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగించే నిర్ణయాన్ని రద్దు చేసి, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారానే అమలు చేయాలని కోరింది.

ఈ డిమాండ్లతో సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ విక్టర్కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ధర్నానుద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ, తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద బీమా, సహజ మరణం, శాశ్వత మరియు పాక్షిక అంగవైకల్యానికి సంబంధించిన నాలుగు ప్రధాన సంక్షేమ పథకాలను ప్రైవేటు బీమా కంపెనీల ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.12 జారీ చేయడం కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు.

జీవో విడుదలైన వెంటనే కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ప్రైవేటు బీమా సంస్థలకు బదిలీ చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమ నిధులను ప్రైవేటు సంస్థలకు మళ్లించడం ద్వారా వెల్ఫేర్ బోర్డు ఉద్దేశాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు.

1996 కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ నిర్ణయాల మేరకే నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా, కమిటీని ఏర్పాటు చేయకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రైవేటు బీమా కంపెనీలకు పథకాలను అప్పగించడం సరైంది కాదన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అవసరం లేని సీఎస్ హెల్త్ టెస్టుల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని, ఈ విధానాన్ని వెంటనే రద్దు చేసి ప్రతి కార్మికుడికి హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య పరీక్షల పేరుతో వెల్ఫేర్ బోర్డు నిధులు వృథా అవుతున్నాయని, అదే నిధులను కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు సంక్షేమ బోర్డులో నమోదు చేసుకున్నప్పటికీ, వారిలో పెద్ద సంఖ్యలో కార్డులు ఇప్పటికీ పునరుద్ధరణ (రెన్యూవల్) కాకపోవడంతో వేలాది మంది సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించి, కార్మికులకు రావాల్సిన నష్టపరిహారం, వివాహ కానుక, ప్రసూతి సాయం, వైద్య సహాయం, అంత్యక్రియల ఖర్చులు తదితర అన్ని సంక్షేమ పథకాలను ఆలస్యం లేకుండా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని, వాటిని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను బలోపేతం చేసి, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే జీవో నెం.12ను సవరించి సంక్షేమ పథకాలను వెల్ఫేర్ బోర్డు ద్వారానే అమలు చేయాలని, ప్రైవేటు బీమా సంస్థలకు మళ్లించిన నిధులను తిరిగి బోర్డు ఖాతాలో జమ చేయాలని, పెండింగ్ క్లెయిమ్‌లను విడుదల చేయాలని, రెన్యూవల్ కాని కార్మికుల కార్డులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సాయిబాబా, నాయకులు ఈశ్వర్, భూపతి రెడ్డి, శివరాజు, లింగం, భూమయ్య, రమేష్, నారాయణ పాల్గొన్నారు.

# విద్యార్థులకు సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలి

**ఆర్టీసీ డీఎంకు బీజేపీ నాయకుల వినతి**

**ఉదయం 8 గంటలకు బస్సు నడపాలని విజ్ఞప్తి**



**కామారెడ్డి ప్రతినిధి జూలై 20 (ప్రజా జ్యోతి):** నసురుల్లాబాద్ మండలంలోని హాజీపూర్, సంగెం, అంకోల్ గ్రామాలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు ప్రతిరోజూ నెమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్టీసీ బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఉదయం 7 గంటలకు బస్సు నడుస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాఠశాల సమయాలకు అనుగుణంగా బస్సు సర్వీసులను ఉదయం 8 గంటలకు నిర్వహించాలని కోరుతూ బీజేపీ నాయకులు బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు ఉదయం 7 గంటల బస్సును అందుకోవాల్సి రావడంతో చాలామంది అల్పాహారం కూడా చేయకుండా పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్న భోజనం వరకు ఆకలితో ఉండాల్సి రావడం వల్ల కొందరు విద్యార్థులు తరగతి గదుల్లోనే అస్వస్థతకు గురవడం, స్పృహ తప్పి పడిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై ఈ పరిస్థితి తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఉదయం చాలా ముందుగానే బయలుదేరాల్సి రావడంతో కొందరు విద్యార్థులు సమయానికి బస్సును అందుకోలేక పాఠశాలకు ఆలస్యంగా చేరుకోవడం, మరికొందరు గైర్హాజరు కావడం జరుగుతోం దన్నారు. దీంతో వారి విద్యాభ్యాసం దెబ్బతింటోందని, కొంతమంది చదువును మధ్యలోనే విరమించే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఉదయం 7 గంటలకు నడుస్తున్న బస్సును ఉదయం 8 గంటలకు నడిపేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాల ప్రారంభ సమయాలకు అనుగుణంగా బస్సు సర్వీసులను పునర్వ్యవస్థీకరించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణమే సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నసురుల్లాబాద్ మండల అధ్యక్షుడు చందూరి హన్మాండ్లు యాదవ్, నెమిలి సర్పంచ్ రామ్ గోపాల్ రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, బీజేపీ నాయకులు శ్యామల శ్రీకాంత్, చీకట్ల రాజు, చరణ్, ప్రణయ్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సమస్యపై ఆర్టీసీ అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కళాశాల సమయాల్లో బస్సులు ఆపకపోవడంతో రోడ్డెక్కిన విద్యార్థులు

**లింగయ్యపల్లి--కొటాలపల్లి విద్యార్థుల ఆందోళనకు ఫలితం**

**రాజంపేట మండలం వరకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక బస్సులు నడుపుతామని డిపో మేనేజర్ హామీ**

**దేవునిపల్లి ఎస్ఐ రంజిత్ సమక్షంలో చర్చలు..**

**రేపటి నుంచే ప్రత్యేక బస్సు పంపిస్తామని అధికారుల ప్రకటన**





**కామారెడ్డి ప్రతినిధి, జూలై 20 (ప్రజా జ్యోతి):** కామారెడ్డి మండలంలోని లింగయ్యపల్లి, కొటాలపల్లి గ్రామాలకు చెందిన కళాశాల విద్యార్థులు తమ రవాణా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేపట్టిన ఆందోళన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కళాశాలలకు వెళ్లే అత్యంత కీలకమైన ఉదయం వేళల్లో, తిరిగి గ్రామాలకు వచ్చే సాయంత్రం సమయంలో ఆర్టీసీ బస్సులు గ్రామాల వద్ద ఆగకుండా వెళ్లిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు చివరకు రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా స్పందించకపోవడంతోనే ఆందోళనకు దిగాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల కథనం ప్రకారం లింగయ్యపల్లి, కొటాలపల్లి గ్రామాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు కామారెడ్డి, రాజంపేట, భిక్కనూరు తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలలకు విద్యాభ్యాసం కోసం ప్రయాణిస్తున్నారు. అయితే కళాశాల సమయాల్లో వచ్చే ఆర్టీసీ బస్సులు ఇప్పటికే ప్రయాణికులతో పూర్తిగా నిండిపోయి రావడం, మరికొన్ని బస్సులు గ్రామాల వద్ద అసలు ఆగకుండానే వెళ్లిపోవడం వల్ల విద్యార్థులు బస్సులు ఎక్కలేని పరిస్థితి నెలకొంటోందని తెలిపారు. దీంతో కొందరు విద్యార్థులు గంటల తరబడి రోడ్డు పక్కనే బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోందని, మరికొందరు అధిక చార్జీలు చెల్లించి ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తోందని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రతిరోజూ ప్రైవేటు వాహనాల్లో వెళ్లడం సాధ్యం కాక చదువుపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ ఉదయం మొదటి పీరియడ్లు మిస్ అవుతున్నాయని, తరచూ ఆలస్యంగా కళాశాలలకు చేరుకోవడంతో అధ్యాపకుల మందలింపులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. హాజరు శాతం తగ్గిపోవడంతో పాటు పరీక్షల్లో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రవాణా సమస్య కారణంగా తమ విద్యాభవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సాయంత్రం కళాశాలల నుంచి తిరిగి వచ్చే సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని విద్యార్థులు తెలిపారు. అప్పటికే బస్సులు ప్రయాణికులతో నిండిపోవడంతో కనీసం నిలబడేందుకు కూడా అవకాశం లేకుండా పోతోందన్నారు. కొన్నిసార్లు డ్రైవర్లు, కండక్టర్లు బస్సులు ఆపకుండానే వెళ్లిపోవడంతో రాత్రి వరకు రోడ్డు పక్కనే వేచి ఉండాల్సి వస్తోందని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థినులు చీకటి పడిన తర్వాత గ్రామాలకు చేరుకోవాల్సి రావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఉదయం కళాశాల సమయానికి రాజంపేట మండలం వరకు ఒక ప్రత్యేక ఆర్టీసీ బస్సు, సాయంత్రం తిరుగు ప్రయాణానికి మరో ప్రత్యేక బస్సును వెంటనే ఏర్పాటు చేయాలని విద్యార్థులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటికే నడుస్తున్న అన్ని ఆర్టీసీ బస్సులు లింగయ్యపల్లి, కొటాలపల్లి గ్రామాల వద్ద తప్పనిసరిగా ఆగేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

ధర్నా సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "విద్యార్థుల ఇబ్బందులు వెంటనే పరిష్కరించాలి", "ప్రత్యేక బస్సులు వెంటనే ఏర్పాటు చేయాలి", "కళాశాల సమయాల్లో బస్సులు తప్పనిసరిగా ఆపాలి", "విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యం చేయొద్దు" అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ధర్నా కారణంగా కొంతసేపు రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న దేవునిపల్లి ఎస్ఐ రంజిత్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులను శాంతింపజేశారు. వారి సమస్యలను ఓపికగా విన్న అనంతరం ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. అనంతరం ఆర్టీసీ డిపో మేనేజర్‌తో నేరుగా చర్చలు జరిపి విద్యార్థుల డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్పందించిన ఆర్టీసీ డిపో మేనేజర్, విద్యార్థుల సమస్యను అర్థం చేసుకున్నామని, రేపటి నుంచే లింగయ్యపల్లి--కొటాలపల్లి గ్రామాల విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసి నడుపుతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రస్తుతం నడుస్తున్న బస్సులు కూడా విద్యార్థులు ఎక్కువగా ప్రయాణించే సమయాల్లో గ్రామాల వద్ద తప్పనిసరిగా ఆగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డిపో మేనేజర్ ఇచ్చిన హామీతో విద్యార్థులు తాత్కాలికంగా ఆందోళనను విరమించారు. అయితే ప్రకటించిన హామీ అమలు కాకపోతే మరింత ఉధృతంగా ఉద్యమం చేపడతామని, అవసరమైతే ప్రజాప్రతినిధులను కలిసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, సరైన రవాణా సౌకర్యం లేక చదువుకు ఆటంకం కలగడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, అధికారులు ఇకనైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

స్థానిక గ్రామస్తులు, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదువును కొనసాగించాలంటే ఆర్టీసీ ప్రత్యేక బస్సులు అత్యవసరమని అభిప్రాయపడ్డారు. డిపో మేనేజర్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ ఆందోళనకు అధికారుల నుంచి సానుకూల స్పందన రావడంతో విద్యార్థులు తాత్కాలికంగా ఊరట పొందినప్పటికీ, హామీ అమలుపైనే తమ తదుపరి కార్యాచరణ ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.

# బీబీపేట్ నూతన ఎస్సై నవీన్ చంద్రను మర్యాదపూర్వకంగా కలిసిన మండల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

**శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరం : ఎస్సై నవీన్ చంద్ర**




**కామారెడ్డి ప్రతినిధి, జూలై 20 (ప్రజా జ్యోతి):** కామారెడ్డి జిల్లా బీబీపేట్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా సబ్ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా బాధ్యతలు స్వీకరించిన నవీన్ చంద్రను సోమవారం బీబీపేట్ మండల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎల్లమైన శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు దేవునిపల్లి తిరుపతి, కార్యదర్శి ఏంబరి ఈ శ్రీనివాస్, కోశాధికారి కారంపూరి వేణు, కార్యవర్గ సభ్యులు కొరవి నరసింహులు, కొమ్మురాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్ చంద్ర మాట్లాడుతూ, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అత్యంత కీలకమని అన్నారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, మహిళలు, విద్యార్థుల భద్రత, ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులు, సామాజిక శాంతికి భంగం కలిగించే సంఘటనలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారం ఉంటేనే పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేసి, నేరరహిత సమాజ నిర్మాణానికి కృషి చేయగలదని ఆయన పేర్కొన్నారు. ప్రజలు నిర్భయంగా పోలీసులను సంప్రదించి తమ సమస్యలను తెలియజేయాలని, పోలీసు-ప్రజల సమన్వయంతో మండలంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కూడా ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిగా పనిచేస్తూ సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు సహకారం అందిస్తామని ఎస్సైకు తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# చిన్నారి హత్యాయత్నం కేసును చేదించిన పోలీసులు

**తండ్రి, సవతి తల్లి ఇద్దరు అరెస్ట్**

**కుక్కలు ఎత్తుకెళ్లాయంటూ నమ్మించే ప్రయత్నం విఫలం**

**చిన్నారిని హత్య చేసేందుకే తండ్రి, సవతి తల్లి పన్నిన పథకం బట్టబయలు**

**వివరాలు వెల్లడించిన బాన్సువాడ డిఎస్పి విఠల్ రెడ్డి**



**బీర్కూర్, (ప్రజా జ్యోతి )జూలై 20:** కామారెడ్డి జిల్లా బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 నెలల చిన్నారి వైష్ణవిపై జరిగిన హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించి, చిన్నారి తండ్రి, సవతి తల్లిని అరెస్ట్ చేశారు. సోమవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో డిఎస్పి విఠల్ రెడ్డి ప్రెస్ మీట్లో కేసు వివరాలను వెల్లడించారు. బీర్కూర్ చెందిన సంధ్యకు సుమారు రెండేళ్ల క్రితం తన అక్క శైలజ భర్త టేకు సతీష్ తో రెండో వివాహం జరిగింది. వీరికి ఏడు నెలల కుమార్తె జన్మించింది. అనంతరం దాంపత్య విబేదాల కారణంగా పెద్దల సమక్షంలో వీరు విడిపోగా, చిన్నారి వైష్ణవిని తండ్రి సతీష్ వద్దే ఉంచాలని నిర్ణయించారు. ఈ నెల 15వ తేదిన ఉదయం చిన్నారి కన్పించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా ఇంటి సమీపంలోని ముళ్ల పొదల్లో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో లభించింది. చిన్నారిని వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై చిన్నారి తల్లి సంధ్య, తన కుమార్తెను హత్య చేయాలనే ఉద్దేశ్యంతో తన అక్క శైలజ ఈ దారుణానికి పాల్పడిందని అనుమానం వ్యక్తం చేస్తూ బీర్కూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి జిల్లా ఎస్పి యం.రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు బాన్సువాడ డిఎస్పి విఠల్ రెడ్డి పర్యవేక్షణలో, బాన్సువాడ రూరల్ సిఐ తిరుపతయ్య, బీర్కూర్, పిట్లం ఎస్సైలు రాములు, ఆంజనేయులు, సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం శాస్త్రీయ దర్యాప్తు చేపట్టి కేసును చేదించడం జరిగిందని డిఎస్పి తెలిపారు. టేకు సతీష్ మొదటి భార్య శైలజకు ముగ్గురు పిల్లలు ఉండగా, అనంతరం శైలజ చెల్లెలైన సంధ్యను రెండో వివాహం చేసుకొని వైష్ణవికి తండ్రి అయ్యాడన్నారు. విడాకుల అనంతరం చిన్నారి వైష్ణవి తండ్రి వద్దే ఉండగా, ఆమెను పోషించడం భారంగా మారిందనే భావనతో కుటుంబ విభేదాల నేపథ్యంలో చిన్నారిని అడ్డు తొలగించుకోవాలని టేకు సతీష్, మొదటి భార్య శైలజ కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ నెల 14వ తేది రాత్రి సమయంలో ఇంటి బయట నిద్రిస్తున్న చిన్నారి వైష్ణవిని ఇద్దరూ కలిసి తీసుకెళ్లి, సీసీ రోడ్డుపై ఈడ్చుకుంటూ కొంత దూరం తీసుకెళ్లి, అనంతరం గడ్డి ఉన్న ప్రదేశంలో పడుకోబెట్టి వెంట తీసుకెళ్లిన బ్లేడుతో చిన్నారి శరీరంపై పలుచోట్ల గాయాలు చేసినట్లు దర్యాప్తులో తేలిందని డిఎస్పి తెలిపారు. చిన్నారి ఏడుపు ఆగిపోవడంతో చనిపోయిందని భావించి అక్కడే వదిలేసి తిరిగి ఇంటికి వెళ్లినట్లు విచారణలో నిందితులు ఒప్పుకున్నట్లు డిఎస్పి తెలిపారు.మరుసటి రోజు ఉదయం చిన్నారి కనిపించడం లేదని గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చి గ్రామస్తులతో కలిసి వెతుకుతున్నట్లు నటించారన్నారు. చిన్నారి ఉన్న ప్రదేశం ముందుగానే తెలిసి కూడా అక్కడికి వెళ్లి కన్పించినట్లు చెప్పి, ఎలాంటి అనుమానం రాకుండా బంధువులతో కలిసి ఆస్పత్రికి తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఘటన అనంతరం చిన్నారిని రాత్రి సమయంలో కుక్కలు ఎత్తుకెళ్లి గాయపరచ్చినట్లు గ్రామస్తులు, బంధువులు, పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశారని డిఎస్పి చెప్పారు. లోతుగా విచారణ చేపట్టి కేసును చేదించామన్నారు. టేకు సతీష్, శైలజను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఒక రెడ్మీ క్రీమ్ కలర్ స్మార్ట్‌ఫోన్ 2. ఒక కార్బన్ కీప్యాడ్ మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సంచలన కేసును అత్యంత సమర్థవంతంగా ఛేదించిన బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య, బీర్కూర్ ఎస్ఐ రాములు,పోలీస్ స్టేషన్ సిబ్బంది, దర్యాప్తులో పాల్గొన్న పిట్లం ఏస్సై ఆంజనేయులు లను జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, అభినందించినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి తెలిపారు.

## సంపాదకీయం

# భార్యల చేతిలో భర్తల 'బలి'

దేశంలో భర్తల భద్రతపై ఆందోళన పెంచుతున్న 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' నివేదిక సంచలనం రేపుతోంది. 2026 జనవరి నుండి జులై 14 వరకు ఆరు నెలల కాలంలో ఏకంగా 554 మంది భర్తలు హత్యలు లేదా ఆత్మహత్యల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఇందులో 322 మంది భార్యలు లేదా వారి ప్రియుల చేతిలో దారుణంగా హత్యకు గురయ్యారు. మిగిలిన 232 మంది వైవాహిక విభేదాలు, గృహహింస, మానసిక వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురవుతుండగా, ఒకరి కంటే ఎక్కువ మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మరణాల వెనుక వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. కుటుంబ వ్యవస్థలో పెరుగుతున్న అశాంతి పురుషుల జీవితాలను తీవ్ర ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఈ గణాంకాలు సమాజంలో నెలకొన్న విషాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. భర్తలపై జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలపై గురుగ్రామ్‌కు చెందిన ఏకం న్యాయ్ ఫౌండేషన్ విడుదల చేసిన తాజా నివేదిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2026 తొలి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా 554 మంది భర్తలు హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ వెల్లడించింది. అయితే ఇవి ప్రభుత్వ అధికారిక గణాంకాలు కాదని.. మీడియా కథనాలు, ఫౌండేషన్ సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటేషన్ రిపోర్టు మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 322 మంది భర్తలు హత్యకు గురయ్యారని తెలుస్తోంది. వీరిలో అత్యధిక కేసులు భార్యలు లేదా వారి వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన కుట్రలతో ముడిపడి ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. మొత్తం హత్యల్లో 194 కేసులు (సుమారు 60.2 శాతం) వివాహేతర సంబంధాల కారణంగానే జరిగినట్లు ఆ రిపోర్టు వెల్లడించింది. భార్యలు, తమ ప్రియులతో కలిసి కట్టుకున్న భర్తలను హత్య చేసిన ఘటనలు ఎక్కువగా నమోదు అయ్యాయని ఆ నివేదిక తెలిపింది. అదే సమయంలో 232 మంది భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ పేర్కొంది. వీటిలో కుటుంబ కలహాలు, గృహహింస, మానసిక వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, పిల్లలను కలవనివ్వకపోవడం వంటి కారణాలు ప్రధానంగా ఉన్నాయని నివేదికలో వివరించింది. ఈ కేసుల్లో విషం పెట్టి చంపడం, గొంతు నులిమి హత్య చేయడం, విద్యుత్ షాక్ పెట్టి హతమార్చడం, సజీవదహనం చేయడం, మృతదేహాలను ముక్కలు ముక్కలుగా నరకడం, చంపేసి ప్రమాదంగా లేదా ఆత్మహత్యగా చిత్రీకరించడం వంటి అత్యంత దారుణమైన నేరాలు నమోదు అయినట్లు ఆ నివేదిక తెలిపింది. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా 93 హత్యలు, 103 ఆత్మహత్యలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ రిపోర్టు తెలిపింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని పేర్కొంది. అయితే.. ఈ నివేదికపై ప్రభుత్వ అధికారిక ధృవీకరణ లేదని ఆ సంస్థ స్పష్టం చేసింది. దేశంలో భర్తల హత్యలు లేదా పురుషులపై గృహహింసకు సంబంధించిన ప్రత్యేక జాతీయ డేటాబేస్ లేకపోవడంతో అసలు సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏకం న్యాయ్ ఫౌండేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో జరిగిన ఘటన అందరినీ గ్భ్రాంతికి గురిచేసింది. అతుల్ పవార్ అనే వ్యక్తిని తన భార్య దామిని, ప్రియుడు తుషార్‌తో కలిసి విషసర్పంతో కాటేయించి చంపేసింది. భర్త పేరుపై ఉన్న 20 లక్షల రూపాయల బీమా సొమ్మును కాజేయాలని, ప్రియుడితో కలిసి జీవించాలని ఆమె పన్నిన పన్నాగం ఇది. నిందితులు పామును కొనుగోలు చేసి, నిద్రమాత్రలు కలిపిన పాలు తాగించి ఈ దారుణానికి ఒడిగట్టారు. పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటాను విశ్లేషించి నిందితులను అరెస్టు చేశారు. 20 రోజుల క్రితమే కారుతో ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసు భార్యాభర్తల మధ్య పెరిగిపోయిన ద్వేషాన్ని, డబ్బు కోసం ఎంతటి దారుణానికైనా తెగించే కఠిన మనస్తత్వాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఇలాంటి ఘటనలు కుటుంబ సంబంధాల పునాదులను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. వైవాహిక జీవితంలో నెలకొంటున్న ఇటువంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సెలింగ్, చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానసిక ఒత్తిడి, అపార్థాలను తొలగించుకోవడానికి సంభాషణలు మాత్రమే సరైన మార్గం. పురుషులు కూడా తమ సమస్యలను పంచుకునే వేదికలు, మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావాలి. ఈ గణాంకాలు ప్రభుత్వాలు, సమాజం కలిసి పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరిస్తున్నాయి. భర్తల ప్రాణాలను కాపాడడం, కుటుంబాలను విచ్ఛిన్నం కాకుండా చూడడం అందరి బాధ్యత. రాబోయే రోజుల్లో అయినా ఇటువంటి దుర్మార్గమైన ఘటనలు తగ్గుతాయని, ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధాలు నెలకొంటాయని ఆశిద్దాం. సామాజిక చైతన్యం ద్వారా మాత్రమే ఇటువంటి దారుణాలకు ముగింపు పలకడం సాధ్యమవుతుంది. ఈ సమస్య తీవ్రతను అంచనా వేయాలంటే అధికారిక గణాంకాల సేకరణ అవసరమని ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ సూచించింది.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమా!



'ప్రభుత్వం ఈ ఏడాదైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుందా? ఇవ్వదా? ఒకవేళ ఇవ్వకపోతే లక్షల రూపాయల ఫీజులు ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలి? ఉన్నత చదువులు ఎలా కొనసాగించాలి?' ఇదీ ప్రస్తుతం రాష్ట్రంలో లక్షలాది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న ప్రశ్న. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులు ప్రస్తుతం ఎదుర్కొంటున్నంత మానసిక ఒత్తిడిని మునుపెన్నడూ చవిచూడలేదని విద్యార్థి సంఘాల నేతలు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను బకాయి పెట్టడం ఒకటైతే, ఈ ఏడాది నుంచి చెల్లింపుల విధానంలో మార్పులు చేయడం మరొకటి! ఇప్పటిదాకా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం నేరుగా కాలేజీలకే చెల్లిస్తున్నది. ఈ విద్యా సంవత్సరం నుంచి కాలేజీలకు కాకుండా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తామని, వాటిని వారు వారం రోజుల్లోగా కాలేజీలకు చెల్లించాలని, అలా చేయకపోతే విద్యార్థుల మీద రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగిస్తామంటూ రేవంత్ సర్కార్ జీవో జారీ చేసింది. ఈ నూతన విధానం ఏ పరిణామాలకు దారితీస్తుందోనన్న ఆందోళన విద్యార్థుల్లో నెలకొన్నది. ఇది ఫీజు రీయింబర్స్‌మెంట్ క్రమంగా ఎత్తివేసే కుట్రగా వివిధ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత 2023-24, 2024-25, 2025-26 అంటే మూడు విద్యా సంవత్సరాలు ముగిసి పోయాయి. నాలుగో విద్యా సంవత్సరం 2026-27 కూడా ప్రారంభమైంది. రేవంత్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వేళ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు ఇప్పుడు ఫైనలియర్‌కు చేరారు. కానీ, ఆయా విద్యార్థుల తరఫున కాలేజీ యాజమాన్యాలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించలేదు. దీంతో కాలేజీల నిర్వహణ కష్టంగా మారుతున్నదని, అధ్యాపకులు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేపోతున్నామని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. దీంతో ప్రభుత్వం బకాయిపడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థులే చెల్లించాలని, లేదంటే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇచ్చేది లేదని చెప్తున్నాయి. మరికొన్ని కాలేజీలు ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించిన 'ప్రత్యేక శిక్షణ తరగతులకు' కూడా తమను నిరాకరిస్తున్నాయని ఫీజు రీయింబర్స్‌మెంట్ క్యాటగిరీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి, ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ప్రపంచ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో జాబ్ మార్కెట్ చాలా డల్‌గా ఉన్నదని, కార్పొరేట్ కంపెనీలు మునుపటిలా 'క్యాంపస్ సెలక్షన్స్' చేపట్టడం లేదని, వందల మందిని రాతపరీక్షలు, ఇంటర్వ్యూలకు పిలిచి కాలేజీకి ఒకరినో ఇద్దరినో రిక్రూట్ చేసుకొంటున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం ఇప్పుడు దాదాపు పది పన్నెండు లక్షల కుటుంబాలకు సమస్యాత్మకంగా మారుతున్నది. కాలేజీ యాజమాన్యాలు మెడ మీద కత్తి పెడుతుండటంతో అధిక వడ్డీలకు అప్పులు చేసి, ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితిని అనేక కుటుంబాలు ఎదుర్కొంటున్నాయి. ఇది ఆయా కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి ఈడ్చుకెళ్తున్నది. నిజానికి, ఉమ్మడి రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చిందే కాంగ్రెస్ సర్కార్. వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి హ్యూమన్ ఫేస్‌ను ఇచ్చిన విశిష్ట పథకాల్లో ప్రధానమైనవి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ! ఆ సత్సంప్రదాయాన్ని రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వాలు కూడా ఎటువంటి భేషజాలకు పోకుండా కొనసాగించాయి.

ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం బకాయి పెట్టిన రెండేండ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సైతం కేసీఆర్ సర్కార్ క్లియర్ చేసింది. కేసీఆర్ మరో అడుగు ముందుకేసి, విదేశీ విద్యానిధి పథకం కింద అల్పాదాయ వర్గాల వారు సైతం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు చేయూతనందించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ కొలువుదీరిన తరువాత ఆయా పథకాలకు గ్రహణం పట్టిందని, నాలుగేండ్ల ఫీజుల బకాయిలు పేరుకొనిపోయాయని విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దాదాపు ఇరవై ఏండ్లపాటు ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిన ఈ పథకం అనేక ప్రయోజనాలు ఇచ్చింది. నిరుపేద కుటుంబాల నుంచి సైతం లక్షలాది మంది యువ ఇంజినీర్లు, వేలాది డాక్టర్లు తయారవ్వడానికి దోహదపడింది. హైదరాబాద్‌లో విస్తరిస్తున్న ఐటీ పరిశ్రమకు అవసరమైన వృత్తి నిపుణులను స్థానికంగానే అందించింది. తీవ్రవాద సంస్థల వైపు ఆకర్షితులు కాకుండా విద్యార్థులను నిరోధించింది. తద్వారా శాంతిభద్రతల పరిరక్షణకు పరోక్షంగా ఉపకరించింది. తమ బిడ్డల ఉన్నత చదువులకు అయ్యే వ్యయం తగ్గడం, ఆ మేరకు అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన దురవస్థ తప్పడంతో రైతుల ఆత్మహత్యలు కూడా తగ్గుముఖం పట్టాయి.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రాధాన్యత, లక్షలాది కుటుంబ ఆర్థిక వ్యవస్థల మీద, హైదరాబాద్ ఐటీ రంగానికి అవసరమైన నిపుణులను అందించడంలోనూ అది చూపిన ప్రభావం అర్థం కాలేదో ఏమో గానీ, దానిని నిర్లక్ష్యం చేస్తున్నారు. 'విద్యార్థుల చదువుల మీద పెట్టేది ఖర్చు కాదు..వారి భవిష్యత్తుతోపాటు రాష్ట్ర, దేశ భవిష్యత్తు కోసం చేస్తున్న ఇన్వెస్ట్‌మెంట్!' అనే స్ఫూర్తితో ప్రభుత్వాలు వ్యవహరించాలి. నిజానికి, ఇప్పుడు టెక్నాలజీ రంగం కొత్త పుంతలు తొక్కుతున్నది. ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారు సైతం కొత్త టెక్నాలజీకి అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సిన దశ నడుస్తున్నది. ఇలాంటి సమయంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు జాబ్ మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా కొత్త టెక్నాలజీని అప్‌డేట్ చేసుకొంటూ, విద్యార్థుల నైపుణ్యాలకు మరింత మెరుగులు దిద్దాల్సిన ఆవశ్యకత ఏర్పడుతున్నది. నాలుగేండ్లపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను బకాయిపెట్టి, ఇప్పటికైనా ఇస్తరో, లేదో, ఇస్తే గిస్తే ఎప్పుడిస్తరో, ఎంత ఇస్తరో తెలియని అయోమయ పరిస్థితులు ఉంటే ఆయా కాలేజీలు కొత్త టెక్నాలజీకి అప్‌డేట్ అవ్వడం సాధ్యమవుతుందా? విద్యార్థులు సైతం నైపుణ్య శిక్షణ మీద వంద శాతం దృష్టిని కేంద్రీకరించగలరా? విద్యార్థుల భవిష్యత్తు పట్ల బాధ్యత గల ప్రభుత్వాలు ఆలోచించాల్సింది.. వారి కోసం పెడుతున్న ఖర్చు ఎలా తగ్గించుకోవాల్నా? అని కాదు; ప్రపంచంతో పోటీ పడేందుకు మరింత నాణ్యమైన విద్యను ఎలా అందించాల్నా అని!

# దీక్షపై రెండు వైఖరులు



ప్రజాస్వామ్యంలో నిరాహార దీక్ష అనేది ఒక వ్యక్తి తన శరీరాన్ని ఆయుధంగా మార్చుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించే అత్యంత శాంతియుతమైన నిరసన రూపం. స్వాతంత్ర్య పోరాట కాలంలో గాంధీజీ దీనిని సత్యాగ్రహం పేరుతో ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఆనాడు దేశ స్వాతంత్ర్య సాధనలో ఈ పోరాట రూపం కీలక పాత్ర పోషించడమే కాకుండా దేశదేశాల్లోని ప్రజలకు స్ఫూర్తిగా నిలిచింది. అధికార పీఠాలను కదిలించి ప్రజల ఆకాంక్షలను సాధించడంలో ఇప్పటికీ ఇదొక సర్వోన్నత ఆయుధంగానే కొనసాగుతున్నది. తెలంగాణ రాష్ట్ర సాధన స్వప్నాన్ని సాకారం చేసేందుకు కేసీఆర్ ఈ మార్గాన్నే ఎంచుకోవడం ఇటీవలి చరిత్ర. హక్కుల ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఢిల్లీలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష నేపథ్యంలో ఇదంతా గుర్తుకు రావడం సహజమే. విద్యారంగంలో చోటుచేసుకున్న అవకతవకలు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, విద్యార్థుల భవిష్యత్తుపై ఏర్పడిన అనిశ్చితికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తున్నారు. కానీ ఈ నిరసన పట్ల కేంద్ర ప్రభుత్వ స్పందన ఆశించినంత స్థాయిలో లేకపోవడం ప్రజాస్వామ్య వర్గాల్లో చర్చకు దారితీస్తున్నది. పైగా నిరాహార దీక్ష చేపట్టిన వ్యక్తిపై ఎన్నడూ లేని స్థాయిలో సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేక ప్రచారం జరుగడం ఆందోళన కలిగిస్తున్నది. వాంగ్‌చుక్‌ను బలవంతంగా దీక్షాస్థలి నుంచి పోలీసుల సాయంతో దవాఖానకు తరలించారు. ఆందోళనకారులతో చర్చలు జరిపేందుకు కేంద్రం ఏమాత్రం సిద్ధంగా లేకపోవడం గమనార్హం. గాంధీజీ ఆశయాలు, ఆదర్శాల పట్ల ఏమాత్రం ఆసక్తి లేని పాలక వ్యవస్థ ఇప్పుడు దేశాన్ని ఏలుతుండటం అందుకు కారణమని అనుకోవాలా?

2011లో అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక నిరాహార దీక్ష ఈ సందర్భంగా సహజంగానే మనకు గుర్తుకు వస్తుంది. అప్పట్లో యూపీఏ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్న సమయంలో అన్నా హజారే ఢిల్లీలోని రామ్‌లీలా మైదానాన్ని ప్రజా ఉద్యమ కేంద్రంగా మార్చారు. జనలోక్‌పాల్ కోసం ఆయన చేసిన దీక్షకు దేశవ్యాప్తంగా అపూర్వ స్పందన లభించింది. అప్పటి ప్రతిపక్షమైన బీజేపీ ఆ ఉద్యమానికి పూర్తి మద్దతు పలుకడం గమనార్హం. అవినీతికి వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహానికి ప్రభుత్వం తలవంచాలని, అన్ని డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. నాడు అన్నా దీక్ష ప్రజాస్వామ్యవాణి అయితే, నేడు వాంగ్‌చుక్ దీక్ష ఎందుకు అదే గౌరవాన్ని పొందడం లేదు అనే ప్రశ్న ఇప్పుడు ముందుకు వస్తున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాఉద్యమాలను ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించిన రాజకీయ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత విమర్శలను ఎందుకు భిన్నంగా చూస్తున్నది? ప్రభుత్వం మారినప్పుడల్లా నిరసనల పట్ల వైఖరి మారిపోవడం భారత రాజకీయాల్లో కొత్త విషయం కాదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాల నిరసనలను తక్కువ చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఇది రాజకీయ నైతికతకు సంబంధించిన ప్రశ్న. అన్నాహజారే ఉద్యమ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 'ప్రజల గొంతు వినాలి' అని బీజేపీ వత్తిడి తెచ్చింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులు నైతిక బాధ్యత వహించాలని హితబోధ చేసింది. కానీ ఇప్పుడు అదే నైతిక ప్రమాణాన్ని కేంద్రంలోని తమ ప్రభుత్వానికి వర్తింపజేయడానికి సిద్ధంగా లేదనేది స్పష్టంగానే తెలిసిపోతున్నది. ఒక ప్రభుత్వ విభాగంపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు, 'జవాబుదారీతనం ఎక్కడ?' అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సర్కార్‌పై ఉంటుంది. అధికారంలో ఉన్నవారు ప్రశ్నలను తప్పించుకోవడం కంటే, వాటిని ఎదుర్కొని ప్రజలకు నమ్మకం కలిగించడం ఎంతైనా అవసరం.

## లోకల్ బాడీ ఎన్నికల్లో జనసేన లొల్లి..

గుంటూరు

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పోటీపై ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు కూటమిలో అగ్గి రాజేస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన, టీడీపీ నేతల మధ్య సీట్ల పంచాయతీకి దారితీసే అవకాశం ఉంది. అయితే టీడీపీ క్యాడర్ స్పందించి ఎలాంటి ప్రకటనలు చేయకుండా పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు ముందుగానే స్పందించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. రాబోయే ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలోని ఏ పార్టీ ఎన్నెన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే అంశంపై టీడీపీ నాయకులెవరూ బహిరంగంగా మాట్లాడవద్దని పార్టీ అధినేతల చంద్రబాబు క్యాడర్‌ను ఆదేశించారు. పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు శనివారం రాత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, అనవసర చర్చలకు అవకాశం ఇచ్చేలా ఏ ఒక్కరూ వ్యవహరించవద్దని హెచ్చరించారు. కూటమి భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య విభేదాలు సృష్టించడానికి గొడ్డలి పార్టీ వైసీపీ కాచుకుని కూర్చుందని, ఈ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఎన్నికల కార్యాచరణను మరింత బలోపేతం చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో వచ్చే నెల మొదటి లేదా రెండో వారంలో ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తామని చంద్రబాబు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటు గురించి టీడీపీ నేతలు చర్చించవద్దని, పోటీ చేసే స్థానాలపై ఎలాంటి ప్రకటనలు చేయవద్దని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆ అంశాన్ని కూటమి పార్టీల అగ్రనాయకత్వం సరైన సమయంలో చర్చించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేయడంపైనే ఫోకస్ చేయాలని సూచించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి అద్భుత ఫలితాలు సాధించేలా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల గుంటూరులో కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో జనసేనకు బలం ఉన్న ప్రతి చోటా తాము తప్పకుండా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం, వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసైనికులు వెనక్కి తగ్గారని గుర్తుచేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని, క్షేత్రస్థాయిలో బలాబలాలు చూసుకుని సర్పంచ్ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీకి జన సైనికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆనాటి సార్వత్రిక ఎన్నికల ఫార్ములా స్థానిక ఎన్నికలకు వర్తించదని, ఈసారి సీట్ల విషయంలో తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పార్టీ కోసం మొదటి నుండి కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు పోటీ చేసేందుకు జనసేనలో తగిన ప్రాధాన్యత, అవకాశాలు కల్పిస్తామన్నారు. కూటమిలోని మిత్రపక్షాలతో తగిన సమన్వయం చేసుకుంటూనే, జనసేన శ్రేణులంతా ఎన్నికలకు సంపూర్ణంగా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రకటనతో కూటమిలో సీట్ల సర్దుబాటుపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

# ప్రసంగాలతో ఇచ్చిపడేస్తున్న రేవంత్

**హైదరాబాద్ :** తెలంగాణా రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తూ దూసుకుపోతున్నారు. ఆయన మాటలు పదునైన ఆయుధాల్లా ప్రత్యర్థుల గుండెల్లోకి దిగిపోతుంటాయి. ఎదుటి వారు తనపై ఎన్ని విమర్శలు సంధించినా, తనదైన వాక్చాతుర్యంతో వాటిని తిప్పికొట్టడంలో ఆయన దిట్ట. రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద సానుకూలత ఆయన ప్రసంగ శైలి. ఎంతటి క్లిష్టమైన అంశాన్నైనా సామాన్యులకు అర్థమయ్యే రీతిలో, ఆకట్టుకునేలా చెప్పడం ఆయన ప్రత్యేకత. తెలంగాణా యాస, మాండలీకాలు, సందర్భోచిత సామెతలను జోడించి ప్రసంగించడంతో జనం ఆయన మాటలకు బాగా కనెక్ట్ అవుతున్నారు. ప్రత్యర్థులపై విమర్శలు చేసేటప్పుడు ఆయన చూపే చొరవ, వ్యూహాత్మకమైన దూకుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏ విషయంపైనైనా విపక్షాల నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు ఆయన ఇచ్చే సమాధానాలు వినడానికి ఆసక్తికరంగా ఉండి, జనంలోకి బలంగా దూసుకెళ్తున్నాయి.రాజకీయ మైదానంలో తనను ఎదుర్కొనే ధీటైన వక్త ఎవరూ లేకపోవడం రేవంత్ రెడ్డికి పెద్ద అడ్వాంటేజ్. తనను విమర్శించే వారి ఫ్లాష్‌బ్యాక్‌ను బయటకు తీసి, జరిగిన పాత విషయాలను ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచడం ఆయన అలవాటు. దీనివల్ల ప్రత్యర్థులు డిఫెన్సివ్‌లో పడుతున్నారు. గతంలో జరిగిన నియామకాలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలను ఆయన తనదైన శైలిలో గుర్తు చేస్తున్నారు. ఎవరైనా తనపై విమర్శలు చేస్తే, దానికి అంతకు పదింతలు ఘాటైన కౌంటర్ ఇవ్వడం రేవంత్ స్టైల్. తన ప్రసంగాల ద్వారా ప్రత్యర్థుల బలహీనతలను ఎత్తిచూపుతూ, వారిని అపహాస్యం చేయడం ఆయన వ్యూహం. ఈ మాటల యుద్ధంలో రేవంత్ రెడ్డిని ఓడించడం బీఆర్ఎస్ నేతలకు సవాలుగా మారింది. ఏ విమర్శకైనా ఆయన రెడీగానే ఉండటం, కౌంటర్ అటాక్‌లో ఆయన చూపే వేగం రాజకీయాల్లో ఆయనను అగ్రస్థానంలో నిలబెడుతోందిఇటీవల నిరుద్యోగ సమస్యపై బీఆర్ఎస్ చేసిన ఆందోళనలను రేవంత్ రెడ్డి తన మాటలతో తిప్పికొట్టారు. ముఖ్యంగా కేటీఆర్ విమర్శలకు ఆయన ఇచ్చిన జవాబు స్ట్రాంగ్ డోస్‌గా మారింది. కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన ఉద్యోగాల కేటాయింపులను ఆయన పక్కా డేటాతో బయటపెట్టారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత, వినోద్ కుమార్ వంటి కుటుంబ సభ్యులకే కేసీఆర్ ఉద్యోగాలు ఇచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన



వారికి సైతం పదవులు కట్టబెట్టి, నియామక పత్రాలు ఇవ్వడం కేసీఆర్ కే చెల్లిందని ఆయన విమర్శించారు. పదేళ్ల కాలంలో నాలుగు కోట్ల తెలంగాణా ప్రజలు కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు ఇస్తే, వారు సమాజానికి ఏమిచ్చారని రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఈ వాదన జనాల్లోకి బాగా వెళ్లడంతో, బీఆర్ఎస్ వాదనలు నీరుగారిపో యాయి. ఆయన ప్రయోగించే ఈ రకమైన రాజకీయ అస్త్రాలు ప్రత్యర్థులను పూర్తిగా ఇరకాటంలోకి నెడుతున్నాయిరేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా కష్టమేనన్న భావన బలపడుతోంది. మాట్లాడితే చాలు, గత ప్రభుత్వ అక్రమాలను, తప్పులను ఆయన ప్రస్తావి స్తూ ప్రత్యర్థుల నోరు మూయిస్తున్నారు. ఆయన చేసే ప్రసంగాల్లో ఉండే స్పష్టత, వాస్తవికత ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. రేవంత్ రెడ్డి ఏమి చెప్పినా, ఏ విమర్శ చేసినా అది బలంగా ప్రజలకు అర్థమవుతోంది. కేసీఆర్ కుటుంబానికి మళ్ళీ అధికారం దక్కనిచ్చే ప్రసక్తే లేదని ఆయన చేస్తున్న భీషణ ప్రతిజ్ఞలు గులాబీ పార్టీకి నిద్రలేని రాత్రులను మిగుల్చుతున్నాయి. మాటకారి వ్యూహకర్త అయిన రేవంత్ రెడ్డితో పెట్టుకోవడం అంటే ప్రమాదకరమని ఆ పార్టీ నేతలు గుర్తిస్తున్నారు. ఆయనతో గొడవ పెట్టుకుంటే ఒకటి అని నాలుగు మాటలు వినక తప్పదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రాజకీయ వ్యూహాల్లో రేవంత్ రెడ్డి వేస్తున్న ప్రతి అడుగు బీఆర్ఎస్ పార్టీ పునాదులను కదిలిస్తోంది.రేవంత్ రెడ్డి రాజకీయ శైలిని గమనిస్తే, ఆయన ఎంతటి తీవ్రమైన విమర్శలనైనా సులువుగా స్వీకరిస్తారని అర్థమవుతుంది. ఆ విమర్శల నుండి పాఠాలు నేర్చుకుంటూనే, తిరుగుదాడి చేయడంలో ఆయన చూపే వేగం ప్రత్యర్థులను ఆశ్చర్యపరుస్తోంది. ఒక ముఖ్యమంత్రిగా తన బాధ్యతలను నెరవేరుస్తూనే, మరోవైపు రాజకీయ ప్రత్యర్థులకు సరైన సమాధానం ఇవ్వడంలో ఆయన రాజీ పడటం లేదు. జనాల్లోకి వెళ్ళడానికి ఆయన ఎంచుకున్న మార్గం, మాట్లాడే పద్ధతి ఈ తరం ఓటర్లకు చాలా బాగా అర్థమవుతోంది. సోషల్ మీడియాలో కూడా ఆయన మాటలు ట్రెండింగ్‌లో ఉంటాయి. ఇలా రేవంత్ రెడ్డి ఒకవైపు అభివృద్ధి పనులు చేస్తూనే, ఇంకోవైపు రాజకీయ ప్రత్యర్థులపై తన మాటల వేటను కొనసాగిస్తున్నారు. రేవంత్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోవడం, ఆయన వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పడం అనేది విపక్షాలకు రాబోయే రోజుల్లో మరింత కష్టతరంగా మారే అవకాశం పుష్కలంగా ఉంది.

# ప్రజాధనం వృథాకు నిలువెత్తు సాక్ష్యం

**నల్గొండ :** నల్లగొండ జిల్లాలోని 7బి డిస్ట్రిబ్యూటరీ కాలువ కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. పీఏ పల్లి మండలంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి గుర్రంపోడు మండల ఎగువ ప్రాంతాల వరకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును మొదలుపెట్టారు. 2008లో 19 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 18 కిలోమీటర్ల మేర ఈ కాలువ తవ్వకానికి శ్రీకారం చుట్టారు. 2009 జనవరిలో ప్రారంభమైన పనులు అత్యంత నత్తనడకన సాగి 2018 నాటికి తానేదారిపల్లి వరకు మాత్రమే పూర్తయ్యాయి. ఆ ఏడాది అట్టహాసంగా నీటిని విడుదల చేసినా, ఆ తర్వాత అధికారుల నిర్లక్ష్యం కారణంగా కృష్ణా జలాలు మళ్లీ ప్రవహించలేదు. సుమారు దశాబ్ద కాలంగా ఈ కాలువ కేవలం కాగితాలకే పరిమితమై, నీటి కోసం ఎదురుచూసే రైతులకు కన్నీళ్లను మిగులుస్తూ శిథిలావస్థకు చేరింది.ఈ ప్రాజెక్టు వైఫల్యానికి కాలువ డిజైనింగ్‌లో జరిగిన తీవ్రమైన లోపాలే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. ఇతర కాలువల వలె కాకుండా, దీనిని ఏకంగా 9 నుండి 12 మీటర్ల లోతులో డీప్ కట్‌గా తవ్వడం శాపంగా మారింది. దీని ఫలితంగా కాలువలో నీరు ఉన్నప్పటికీ, అవి గ్రావిటీ ద్వారా పక్కనే ఉన్న ఆయకట్టు పొలాలకు చేరడం అసాధ్యంగా మారింది. గతేడాది వర్షాకాలంలో ముక్కపల్లి చెరువు తెగి వర్షపు నీరు కాలువలోకి చేరగా, డీప్ కట్ కారణంగా కేవలం ఊట నీరు పైకి వచ్చిందే తప్ప అసలైన సాగునీరు అందలేదు. పీఏ పల్లి, గుర్రంపోడు మండలాల్లోని మొత్తం 10 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ కాలువ ద్వారా నీరు అందించాలనే ప్రణాళికలు అశాస్త్రీయ నిర్మాణాల కారణంగా విఫలమయ్యాయి. డివిజన్ల విభజన గందరగోళంతో అధికారులు బాధ్యత తీసుకోక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.ప్రస్తుతం మైలాపురం నుండి తానేదారిపల్లి వరకు కాలువ తవ్వకం పూర్తి కాగా, అక్కడి నుండి తేనపల్లి చెరువు వరకు జరగాల్సిన మరో 3 కిలోమీటర్ల పనులు పూర్తిగా నిలిచిపోయాయి. తానేదారిపల్లి చెరువును రిజర్వాయర్‌గా మార్చి, కొత్త డిజైన్‌తో ముందుకు వెళ్తామని చెప్పిన అధికారులు ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడలేదు. గతంలో మంజూరైన నిధుల్లో ఇప్పటికీ 5 కోట్ల రూపాయలు మిగిలి ఉన్నప్పటికీ పనులు ముందుకు సాగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఒకవేళ ఈ 3 కిలోమీటర్ల పనులు సకాలంలో పూర్తయితే, అదనంగా మరో 3 వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. అరకొర పనుల వల్ల కాలువ పక్కన ఉన్న రైతులు తమ పొలాల్లోకి వెళ్లలేని దుస్థితి నెలకొంది. అంతర్గత బ్రిడ్జిల నిర్మాణం పెండింగ్‌లో ఉండటంతో రైతులు తమ సాగు




పనుల కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది.కాలువ తవ్వకం వల్ల రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా బ్రిడ్జిలు లేక రెండు విధాలుగా నష్టపోతున్నారు. మిగిలి ఉన్న 5 కోట్ల రూపాయల నిధులను తక్షణమే విడుదల చేసి నిలిచిపోయిన పనులను పూర్తి చేస్తేనే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. గుర్రంపోడు, గుడిపల్లి వాగుల్లో చిన్న తరహా రిజర్వాయర్లను నిర్మిస్తే భూగర్భ జలాలు స్థిరంగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల కాలువ నీటిపైనే ఆధారపడకుండా బోరు బావుల ద్వారా రైతులు పంటలు పండించుకునే వెసులుబాటు లభిస్తుంది. డీప్ కట్ వల్ల నీరు అందని ప్రాంతాల్లో చిన్నపాటి లిఫ్ట్ మెకానిజం ఏర్పాటు చేయడం ద్వారా ఆయకట్టుకు నీరు మళ్లించేలా రీడిజైన్ చేయాలి. ఏళ్లుగా సాగునీరు అందక అలమటిస్తున్న వేలాది ఎకరాల భూములకు సాగునీరు అందించి, రైతాంగానికి ఆర్థిక భరోసా కల్పించాలని ఆ ప్రాంత రైతులు వేడుకుంటున్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి 7బి డిస్ట్రిబ్యూటరీకి శాశ్వత మోక్షం కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. కోట్లాది రూపాయల నిధులు వృథా కాకుండా చూడటంలో జిల్లా యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం. నీటిని వృథాగా పోనివ్వకుండా, ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి నీరు అందేలా ప్రణాళికలు రూపొందించడంపై దృష్టి సారించాలి. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అంచనా వేయకుండా చేసిన పనులు అట్టహాసంగా మొదలై చివరకు విఫలమయ్యాయి. ఇప్పుడు మిగిలి ఉన్న నిధులను పారదర్శకంగా వినియోగించి, నిర్మాణ లోపాలను సరిదిద్దడం ద్వారా మాత్రమే రైతుల కష్టాలకు తెర పడుతుంది. సాగునీటి సౌకర్యం కల్పిస్తేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం కావడమే కాకుండా, రైతులు వ్యవసాయంలో లాభాలను పొందే అవకాశం ఉంటుంది. అధికారులు తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాలి.నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల్లో జరిగిన ఈ తప్పిదాలు భవిష్యత్తులో ఇతర పథకాల అమలులో అధికారులకు హెచ్చరికగా మారాలి. కేవలం నిధులు ఖర్చు చేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రణాళికలు, అధికారుల సమన్వయం ఉండటం చాలా అవసరం. 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే సంకల్పం నెరవేరాలంటే ఇంజనీరింగ్ విభాగం తక్షణమే రీడిజైన్ ప్రక్రియను చేపట్టాలి. 5 కోట్ల నిధుల వినియోగంలో జాప్యం జరగకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్ కార్యాలయంపై ఉంది. రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, తానేదారిపల్లి నుండి తేనపల్లి చెరువు వరకు కాలువ తవ్వకం పూర్తి చేయాలి. బ్రిడ్జిల నిర్మాణం, లిఫ్ట్ పాయింట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తేనే ప్రాజెక్టు సార్థకత ఉంటుంది. ఇప్పటికైనా యంత్రాంగం మేల్కొంటేనే వేల ఎకరాలకు నీరు అంది రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరడం సాధ్యమవుతుంది

## చిలుకూరులో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య పంట పొలాల పరిశీలన..

### రైతులు, వ్యవసాయ కూలీలతో మాజీ ఎమ్మెల్యే భేటీ



**సూర్యాపేట :** చిలుకూరు మండల కేంద్రంలోని పంట పొలాలను పరిశీలించిన కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ రైతులు, వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాగునీటి కొరతతో నాట్లతో పచ్చగా కళకళలాడాల్సిన పొలాలు బీడుగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలపై నిపుణులు ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు తీసుకోలేదని విమర్శించారు.భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్లలో నీరు అందక రైతులు పరిమిత విస్తీర్ణంలోనే సాగు చేస్తున్నారని, రైతులు వ్యవసాయం చేయలేకపోతే వ్యవసాయ కూలీలకు కూడా ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు తప్పవని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు పనుల కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.సాగునీటి లభ్యతపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వడంతో పాటు కరువు నివారణ చర్యలను అత్యవసరంగా చేపట్టి రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చిలుకూరు గ్రామ ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగయ్య సొసైటీ చైర్మన్ అలస కాని జనార్ధన్ చిలుకూరు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జానకి రామాచారి తాళ్లూరి శ్రీనివాస్, బండి కాశయ్య, అంబాల వెంకటి, బెల్లంకొండ సైదులు, గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## గులాబీ కంచుకోటపై కాంగ్రెస్ కన్ను



**కరీంనగర్ :** తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ఇప్పుడు సరికొత్త, అత్యంత వ్యూహాత్మకమైన అంతర్గత పోరాటం సాగుతోంది. నిన్నటివరకు తిరుగులేని రాజకీయ శక్తులుగా, అజేయమైన కోటలుగా వెలిగిన బీఆర్ఎస్ టాప్ లీడర్ల సొంత నియోజకవర్గాలపై అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా కన్నేసింది. గులాబీ దళపతి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడ్డా సిరిసిల్ల, ట్రబుల్ షూటర్ హరీష్ రావు కంచుకోట సిద్దిపేట నియోజకవర్గాల్లో పొలిటికల్ హీట్ అమాంతం పెరిగింది. ప్రధాన నేతలను నేరుగా ఢీకొట్టడం కంటే, వారి రాజకీయ పునాదులను కదిలించేలా ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ వేస్తున్న అడుగులు క్షేత్రస్థాయి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి.నిన్నటివరకు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుముకగా నిలిచిన స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులను కాంగ్రెస్ స్థానిక నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు వ్యూహాత్మకంగా ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా గజ్వేల్ ? సిద్దిపేట సరిహద్దు ప్రాంతాల్లో ఈ సైలెంట్ ఆపరేషన్ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. టాప్ లీడర్లు హైదరాబాద్‌లోనే ఉంటూ అసెంబ్లీ లేదా మీడియా వేదికలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం హస్తం శ్రేణులు గ్రామాల్లోని కరడుగట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారు. గజ్వేల్ లాంటి ప్రాంతాల్లో క్యాంప్ ఆఫీసుల చుట్టూ జరుగుతున్న రాజకీయ ఘర్షణలు, నిరసనలు కేవలం పైకి కనిపిస్తున్న ఊహాగానాలు కావు, లోపల మాత్రం కాంగ్రెస్ తన పనిని నిశ్శబ్దంగా పూర్తి చేస్తోంది. పదేళ్ల కాలంలో గ్రామాల్లో పనులు చేసి బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మాజీ సర్పంచులు, నిధుల కొరతతో సతమతమవుతున్న ప్రజాప్రతినిధుల బలహీనతలను కాంగ్రెస్ పార్టీ క్యాష్ చేసుకుంటోంది. వారికి అధికార పార్టీ అండగా ఉంటుందనే భరోసా ఇస్తూనే, మూడు రకాల ఆకర్షణీయమైన వ్యూహాలను అమలు చేస్తోంది. త్వరలో రాబోయే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని లేదంటే స్థానిక నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీలు ఇస్తోంది. దారికి రాకపోతే అధికార బలంతో స్థానిక పనులకు బ్రేకులు వేయడం లేదా సహకరించడం ద్వారా ఒత్తిడి పెంచుతోంది. బీఆర్ఎస్ అధిష్టానానికి, స్థానిక లీడర్లకు మధ్య గ్యాప్ పెంచేందుకు ప్రయత్నిస్తోంది. మీరు ప్రతిపక్ష పార్టీలో ఉంటే మీకు లాభం ఉండదని, అధికార పార్టీలోకి వస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమనే ప్రచారాన్ని క్యాడర్‌లోకి బలంగా తీసుకెళ్తున్నారు. దీనివల్ల నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఇంకా బలంగానే కనిపిస్తున్నా, లోపలి గ్రామాల్లో మాత్రం గులాబీ కోటల పునాదులు నెమ్మదిగా బలహీనపడుతున్నాయి.అయితే, ఈ ఆపరేషన్ కాంగ్రెస్‌కు అంత సులభంగా ఏకపక్షంగా సాగడం లేదు. సిద్దిపేట, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో హరీష్ రావు లాంటి సీనియర్ నేతలు రంగంలోకి దిగి డ్యామేజ్ కంట్రోల్ చర్యలు చేపట్టారు. అలకపాన్పు ఎక్కిన కార్యకర్తలను బుజ్జగించేందుకు, పార్టీ మారిన వారిని తిరిగి సొంత గూటికి చేర్చుకునేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల వైఫల్యాలను, స్థానిక సంస్థల ఎన్నికల జాప్యాన్ని ఎండగడుతూ రివర్స్ అటాక్ చేస్తున్నారు. అయినప్పటికీ, అధికార పార్టీ విసిరిన వ్యూహాత్మక వలయం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో కొంత అయోమయం స్పష్టంగా కనిపిస్తోంది. కంచుకోటలుగా భావించే ఈ మూడు నియోజకవర్గాల్లో క్యాడర్ గనుక చెల్లాచెదురైతే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.గులాబీ నేతలకు హస్తం పార్టీ వేస్తున్న ఈ గాలం కేవలం తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం లేదా కేవలం స్థానిక లీడర్లను మార్చడం కోసం మాత్రమే కాదు. దీని వెనుక పెద్ద స్కెచ్ ఉంది. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను రాష్ట్రస్థాయి రాజకీయాలపై దృష్టి పెట్టకుండా, వారి వారి సొంత నియోజకవర్గాల రక్షణలోనే నిరంతరం బిజీగా ఉంచాలనేది కాంగ్రెస్ మార్క్ హైలెవల్ పొలిటికల్ స్ట్రాటజీ. తద్వారా రాష్ట్రస్థాయిలో ప్రభుత్వంపై వారి దూకుడును తగ్గించవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మైండ్ గేమ్‌లో అధికార కాంగ్రెస్ ఎంతవరకు సఫలమవుతుంది, గులాబీ త్రయం తమ కంచుకోటలను ఎలా కాపాడుకుంటుంది అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

## అధిష్టానం ఎంట్రీతో ఈటెల, బండి మధ్య గ్యాప్ తగ్గినట్టేనా

**హైదరాబాద్ :** తెలంగాణ భారతీయ జనతా పార్టీలో గత కొంతకాలంగా సాగుతున్న అంతర్గత విభేదాలకు చెక్ పెట్టేందుకు అధిష్టానం ప్రయత్నాలు షురూ చేసింది. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్న ఢిల్లీ పెద్దలు, ఇక్కడి కీలక నేతల మధ్య ఉన్న కోల్డ్ వార్‌ను ముగించడానికి నేరుగా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగానే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఎమ్మెల్యే అభయ్ పాటిల్ ఆధ్వర్యంలో బుజ్జగింపుల పర్వం ఊపందుకుంది. రాష్ట్ర బీజేపీలో అత్యంత కీలక నేతలుగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైకమాండ్ గట్టి ప్రయత్నాలే చేస్తోందిఈ వివాదాన్ని వీలైనంత త్వరగా సమసిపోయేలా చూడాలనే పట్టుదలతో అధిష్టానం ఉంది. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లిన అభయ్ పాటిల్, రాత్రి పొద్దుపోయే వరకు ఆయనతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత పరిణామాలు, విభేదాలకు గల కారణాలపై ఆయనతో ఆరా తీశారు. అనంతరం బండి సంజయ్‌తో కూడా అభయ్ పాటిల్ భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈ క్రమంలోనే ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ నివాసంలో ఒక కీలకమైన భేటీ జరగనుంది. ఈ మీటింగ్‌కు ఈటల రాజేందర్, బండి సంజయ్ ఇద్దరూ హాజరుకానుండటం విశేషం. అధిష్టానం దూతలుగా వచ్చిన సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ సమక్షంలో ఈ ఇద్దరు నేతలను ఒకే వేదికపైకి తెచ్చి, వారి మధ్య ఉన్న మనస్పర్థలను తొలగించడానికి లక్ష్మణ్ నివాసం వేదిక కాబోతోంది.కొంతకాలంగా ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య సఖ్యత లోపించిన విషయం బహిరంగ రహస్యమే. ఒకరిపై మరొకరు పరోక్షంగా పలుమార్లు విమర్శలు, ఆరోపణలు గుప్పించుకున్నారు. ఈ ఇద్దరు నేతల మధ్య ఉన్న గ్యాప్ చూసి వారి అనుచరులు, అభిమానులు మరింత రెచ్చిపోయారు. పలు సందర్భాల్లో పరస్పర వ్యతిరేక పోస్టర్లు, ఫ్లెక్సీలు కూడా వెలిశాయి. ఈ అంతర్గత విభేదాలు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేశాయి. ఈ ప్రభావం పార్టీ బలోపేతంపై పడుతుండటంతో ఢిల్లీ పెద్దలు అలర్ట్ అయ్యారు.ఇటీవల తెలంగాణలో పర్యటించిన జాతీయ నేతలు నితిన్ నబీన్, జేపీ నడ్డా సైతం రాష్ట్ర నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి, పార్టీ ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని కరాఖండిగా చెప్పారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు రాకపోవడంతో, ఇప్పుడు నేరుగా హైకమాండ్ రాయబారాన్ని పంపింది. తెలంగాణలో అధికారమే పరమావధిగా భావిస్తున్న బీజేపీకి ఈ ఇద్దరు నేతలూ అత్యంత అవసరం. బండి సంజయ్ మాస్ లీడర్‌షిప్, కేడర్‌లో ఉన్న ఫాలోయింగ్ పార్టీకి ఎంత ప్లస్సో.. ఈటల రాజేందర్ రాజకీయ అనుభవం, వ్యూహాలు అంతే ముఖ్యం. వీరిలో ఏ ఒక్కరిని వదులుకోవడానికి లేదా దూరం పెట్టడానికి అధిష్టానం సిద్ధంగా లేదు. ఇద్దరి బలాలు కలిస్తేనే తెలంగాణలో అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని ఢిల్లీ పెద్దలు బలంగా నమ్ముతున్నారు.అధిష్టానం నేరుగా రంగంలోకి దిగడం, ఇవాళ ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు కీలక నేతలు ముఖాముఖి కూర్చోనుండటంతో ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ చర్చల తర్వాతైనా ఇద్దరు నేతలు తమ పంతాలను వీడి, పార్టీ కోసం కలిసి నడుస్తారని సాధారణ కార్యకర్తలు, క్యాడర్ ఆశగా ఎదురుచూస్తున్నారు. మరి ఢిల్లీ పెద్దల బుజ్జగింపులు ఎంతవరకు పారుతాయో, టీ బీజేపీలో ఈ అంతర్గత సంక్షోభానికి తెరపడుతుందో లేదో చూడాలి.

## క్రెడిట్ కోసం కమలం...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ బలోపేతం కావడానికి ప్రయత్నాలు ఎన్నికలకు మూడేళ్ల ముందు ప్రారంభించినట్లు కనిపిస్తుంది. ఇప్పటి వరకూ కొంత ఆలోచన చేస్తూ.. తన పార్టీ కార్యక్రమాలకే పరిమితమవుతున్న నేతలు ఇకపై రాష్ట్రాభివృద్ధిలో తమ పాత్రపైనా జనంలో చైతన్యం తెచ్చేందుకు అవసరమైన చర్యలు ప్రారంభించిందని అనుకోవాల్సి ఉంటుంది. అందుకే ఇటీవల బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ నేతృత్వంలో పోలవరం పర్యటనకు బయలుదేరి వెళ్లారరు. పోలవరం ప్రాజెక్టు పూర్తవుతున్న దశలో జాతీయ ప్రాజెక్టుకు నిధులు ఇచ్చింది కేంద్రలో అధికారంలో ఉన్న బీజేపీ అన్న విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. అందుకే తాజాగా జరిగిన పార్టీ సమావేశంలోనూ బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ కీలక వ్యాఖ్యలు రాజకీయంగా హాట్ టాపిక్ అయ్యాయి. పోలవరంపై క్రెడిట్ తీసుకోవడంలో విఫలమయ్యామని మాధవ్ అన్నారు. అమరావతికి నిధులు, సీమకు ప్రాజెక్టులు ఇచ్చినా చెప్పుకోలేకపోయామని అనడం వారు ఇకపై కేంద్ర నిధుల ప్రస్తావన పదే పదే ప్రచారం చేస్తూ పార్టీ బలోపేతానికి ప్రయత్నం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రజల ముందు తలెత్తుకుని చెప్పుకోవాల్సిన నేతలు, ఇన్నాళ్లూ మౌనంగా ఉండటం వల్ల నష్టపోయామని బీజేపీ రాష్ట్ర నేతలు గుర్తించారు. కూటమిలో ఉంటూనే రాష్ట్రాభివృద్ధిలో తమ పాత్రను తెలియ చేయాలని నిర్ణయించారు. ఎన్నికల్లో పోటీ చేయాలంటే గెలిచే శక్తి ఉండాలి . సీట్లు అడగడం ముఖ్యం కాదు గెలవగలమన్న నమ్మకం పార్టీ నాయకత్వానికి కల్పించాలి. పార్టీకి ఇప్పుడే మళ్లీ మంచి వాతావరణం ఉందని, మరో స్టెప్ ఎక్కాలని భావిస్తున్నారు. కూటమిలో కార్యకర్తలకు అన్యాయం జరిగితే పార్టీ అండగా ఉంటుందని బీజేపీ నేతలు భావిస్తున్నారు. అలాగే ఇకపై యాచించడం అంటూ ఏమీ ఉండకుండా శాసించే స్థాయికి ఎదగాలని, మనకు అవతలి వారి అవసరం ఎంత ఉందో.. దానికి రెట్టింపు అవసరం మనతో వారికీ ఉందని బీజేపీ నేతలు నేటికీ గుర్తించి ఇక కార్యాచరణకు సిద్ధమయ్యారు. అందుకే ఇక వరస సమావేశాలు నిర్వహించడమే కాకుండా కేంద్ర నాయకులను కూడా రాష్ట్రానికి రప్పించి పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని పార్టీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

## గులాబీ గ్రాఫ్ పెరిగినట్టేనా




**హైదరాబాద్ :** బీఆర్ఎస్ క్రమంగా తెలంగాణ లో పుంజుకుంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే బీఆర్ఎస్ ఎఫెన్స్ లో వెళు తుంది. రేవంత్ ప్రభుత్వంపై విరుచుకుపడుతుంది. అవినీతి ఆరోపణలతో హామీలు అమలు చేయకపోవడంపై నిలదీస్తుంది. వర్గాల వారీగా విభజించుకుని వారిని సమీకరించడంలో కొంత గులాబీ పార్టీ సక్సెస్ అయినట్లు కనిపిస్తుంది. ప్రధానంగా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని కారు పార్టీ హస్తానికి గురిపెట్టింది. దీంతో బీఆర్ఎస్ క్రమంగా బలం పెంచకుంటుందన్న వార్తలు అధికార పార్టీలో కలవరం రేపుతున్నాయి. ఈ విషయాన్ని సొంత పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి చెప్పారు. బీఆర్ఎస్ బలం పుంజుకుంటుందని చెప్పిన ఆమె తర్వాత మాట మార్చినప్పటికీ మీడియాలో అన్న వార్తలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రేణుక అన్నారని కాదు కానీ.. ప్రతి ఒక్క కాంగ్రెస్ నేత మనసులో కూడా ఇదే అభిప్రాయం ఉన్నట్లు కనపడుతుంది. కేసీఆర్ బయటకు రాకపోయినా.. ఆయనపై చేసే వ్యక్తిగత విమర్శలు కూడా ఆ పార్టీకి సానుభూతిని తెచ్చి పెడుతున్నాయంటున్నారు. దీంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వరసగా బీఆర్ఎస్ సమావేశాలను నిర్వహిస్తూ ప్రజలను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తుంది. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులు జనంలోకి వెళుతున్నారు. వారి పర్యటనలకు కూడా మంచి స్పందన లభిస్తుంది. ఇచ్చిన హామీలను కొన్నింటిని అమలు చేసినా, అమలు చేయని వాటిని ఫోకస్ చేయడంతో పాటు ఎరువులు కొరత, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, కరువు ఇలాంటి విషయాలన్నీ తమకు అనుకూలంగా మలచుకోవడంలో బీఆర్ఎస్ సక్సెస్ అయిందనే చెప్పాలి. నిన్న జరిగిన యువ సంగ్రామ సదస్సు కూడా విజయవంతం కావడంతో పాటు కేటీఆర్ తాము అధికారంలో ఉన్నప్పుడు తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దుకుంటామని హుందాగా వ్యవహరించడం కూడా ఒకింత జనానికి చేరువ చేసిందనే చెప్పాలి. మొత్తం మీద కాంగ్రెస్ అప్రతమత్తం కాకుంటే వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం అంత సులువు కాదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి

## చామకూర దారెటు..



**హైదరాబాద్ :** తెలుగు నేల రాజకీయాల్లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వ్యవహారం ఎప్పటికప్పుడు హాట్ కేక్ మాదిరిగానే ఉంటోంది. ఏ పార్టీలో ఉన్నా తనదైన మార్కు రాజకీయం, తనదైన మార్కు వ్యవహారంతో మల్లారెడ్డి నిత్యం వార్తల్లోనే ఉంటారు. ప్రస్తుతం బీఆర్ఎస్ లో కొనసాగుతున్న మల్లారెడ్డి? ఆ పార్టీని వీడతారంటూ చాన్నాళ్లుగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే ఎప్పటికప్పుడు ఆ వాదనలను కొట్టిపారేస్తున్న సీనియర్ నేత? మళ్లీ అవే వార్తలకు బలం చేకూర్చేలా వ్యవహారం నడుపుతూ నిజంగానే వార్తల్లో నేతగా నిలుస్తున్నారు. తాజాగా మల్లారెడ్డికి చెందిన ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోను చూస్తుంటే? ఇక మల్లారెడ్డి బీఆర్ఎస్ కు వీడ్కోలు పలికినట్టేనన్న వాదనలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.తెలంగాణ రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారిన ఈ వీడియోలో మల్లారెడ్డి అసలు నోరు మెదపనే లేదు. ఈ వీడియోలో కాంగ్రెస్ పార్టీ కీలక నేత, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్నారు. తన ప్రసంగంలో ఆయన బీఆర్ఎస్ అదినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుపై ఓ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కేసీఆర్ పై ఆ రేంజిలో రేవంత్ విమర్శలు గుప్పిస్తూ ఉంటే?ఆయనకు వెనుక?ఆయనకు దాదాపుగా ఆనుకుని కూర్చుని ఉన్న మల్లారెడ్డి? తన ముఖంలో ఏ భావమూ కనిపించనీయకుండా అలా కూర్చుండి కనిపిస్తున్నారు..కేసీఆర్ బీఆర్ఎస్ అధినేతనే కదా. అంతేనా? టీడీపీ నుంచి బీఆర్ఎస్ లోకి రాగానే ఎమ్మెల్యే టికెట్ తో పాటుగా ఏకంగా మంత్రి పదవి ఇచ్చి? మల్లారెడ్డికి రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యం కల్పించిన నేతగా కేసీఆర్ ఉన్నారు. అలాంటి కేసీఆర్ ను రేవంత్ రెడ్డి ఓ రేంజి విమర్శలు సంధిస్తూ ఉంటే? మాట మాత్రంగా కూడా స్పందించని మల్లారెడ్డి?కనీసం అక్కడి నుంచి వెళ్లిపోవాలన్న సోయి కూడా లేకుండా కూర్చుని ఉన్నారంటూ బీఆర్ఎస్ నేతలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ కేసీఆర్ ను ఆ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్న వేదికపై అలా కూర్చుని ఉండిపోయిన మల్లారెడ్డి తీరు చూస్తుంటే? ఆయన గులాబీ పార్టీ నుంచి వేరు పడాలని దాదాపుగా నిర్ణయించుకున్నారన్న సరికొత్త విశ్లేషణలు రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అదికారం కోల్పోయిన తర్వాత అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ లోకో, లేదంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలోనో మల్లారెడ్డి చేరిపోయే దిశగా సాగుతున్నారన్న వార్తలు నిత్యం వినిపిస్తూనే ఉన్నాయి. అంతేకాకుండా తనతో ఉప్పునిప్పులా వ్యవహరించిన రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో మల్లారెడ్డి అలా స్పందన లేకుండా కూర్చున్నారంటే.. ఆయన బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరిపోవాలని నిర్ణయించుకున్నట్టేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ఆగస్టు 1న భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభం



**విజయనగరం :** విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మాణ పనులను పూర్తి చేసుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఇటీవల ఎయిర్ పోర్ట్ నిర్మాణ చివరి దశ పనులు సైతం పూర్తయ్యాయి. ఆగస్టు 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం జరగనున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం నాడు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. ఆగస్టు ఒకటో తేదీ.. ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్రగా నిలిచేందుకు ముహూర్తం ఆసన్నమైందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఓ ఒక అద్భుతమైన ఘట్టం ఆవిష్కృతం అవుతున్న సమయంలో.. ఆంధ్ర రాష్ట్ర ప్రజలంతా తమ మద్దతును అందివ్వాలని రామ్మోహన్ నాయుడు కోరారు. ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించి పూర్తి షెడ్యూల్, వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవ వేడుక చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత ఘనంగా జరిగేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు ఎయిర్ పోర్ట్ పనుల పురోగతి, ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఒక మణిహారం లాంటిది. ఇది ఈ ప్రాంతానికి సరికొత్త ఆర్థిక, పారిశ్రామిక అవకాశాలను తీసుకువస్తుంది. భోగాపురం విమానాశ్రయం, పర్యాటక ప్రాజెక్టులు, పోర్టులు, జాతీయ రహదారులు, పరిశ్రమల అనుసంధానంతో ఉత్తరాంధ్ర ఇకపై అన్‌స్టాపబుల్ గా దూసుకుపోతుందని దీమా వ్యక్తం చేశారు. ఈ ఎయిర్ పోర్ట్ లోని ప్రతి విభాగం ఏపీ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**ఉత్తరాంధ్ర ఇక అన్ స్టాపబుల్**

తెలుగుదేశం ప్రభుత్వంలో మొదలైన భోగాపురం ఎయిర్ పోర్టు పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసి?రెండేళ్ల కాలంలో పూర్తి చేసిందని చంద్రబాబు చెప్పారు. సర్వాంగ సుందరంగా తయారైన భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భోగాపురం ఎయిర్ పోర్టులో నిర్మాణ వివరాలు, వసతులు, సౌకర్యాలను అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. ఎయిర్ పోర్టు కార్యకలాపాలు ప్రారంభించడానికి అవసరమైన 8 కీలక అనుమతులు ఇప్పటికే పొందినట్లు తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ”ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్ పోర్టు కీలకం కానుంది. సామాన్యుల జీవితాలను మార్చే విధంగా ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రలో కొత్త అవకాశాలను తీసుకువస్తుంది. ఎకనమిక్ యాక్టివిటీ ఉరుకులు పెడుతుంది. రాకపోకలు మొదలయ్యాక ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మారుతాయి. సామాన్యులు కూడా అనేక రకాలుగా లబ్ది పొందుతారు. విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో ఈ ఎయిర్ పోర్టు కీలక పాత్ర పోషిస్తుంది. హైదరాబాద్‌లో వచ్చిన శంషాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు ఆ ప్రాంతంలో ఎటువంటి మార్పులు తెచ్చిందో నేడు భోగాపురంతో ఆ ప్రాంతంలోనూ అటువంటి మార్పులే తెస్తుంది.“ అని అన్నారు.“ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, కళలను చాటేలా అత్యంత కళాత్మకంగా ఎయిర్ పోర్టులో ప్రతి విభాగాన్ని తీర్చిదిద్దాలి. ప్రధాని చేతుల మీదు జరిగే ప్రారంభోత్సవం చరిత్రలో నిలిచిపోవాలి. గిరిజన సంస్కృతి, హస్తకళలు గుర్తు చేసేలా స్వాగత కార్యక్రమం ఉండాలి. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభాన్ని ఉత్తరాంధ్రలోని ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు సెలబ్రేట్ చేసుకోవాల్సిన శుభ సందర్భం. ప్రతి పౌరుడూ ఎయిర్ పోర్టును చూసి గర్వించే పరిస్థితి రావాలి. ఉత్తరాంధ్రలో దీన్ని పండుగలా చేసేలా ప్రజలను, విద్యార్థులను, యువతను భాగస్వాములను చేయాలి” అని సీఎ చంద్రబాబు ఆదేశించారు

# ఆర్మూరులో వేడెక్కిన రాజకీయం





**నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య జరుగుతున్న తీవ్రమైన మాటల యుద్ధం సోషల్ మీడియా వేదికల నుండి క్షేత్రస్థాయి వరకు పాకింది. ముఖ్యంగా అంకాపూర్ గ్రామంలో బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి నివాసం వద్ద కాంగ్రెస్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎమ్మెల్యేను నిలదీసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించగా, తన ఇంటి వద్దే వేచి ఉంటానని రాకేశ్ రెడ్డి సవాల్ విసరడంతో ఉద్రిక్తత పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక రాజకీయాలు రసవత్తరంగా మారాయి. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసేందుకు ఆర్మూర్ పట్టణం, అంకాపూర్ గ్రామంలో 144 సెక్షన్ విధించారు. ఇరువర్గాల కార్యకర్తల పోటాపోటీ ఆందోళనలతో ఆర్మూర్ నియోజకవర్గం మొత్తం ఒక్కసారిగా అట్టుడికిపోతోంది. శాంతి భద్రతల దృష్ట్యా భారీ పోలీసు బలగాలను మోహరించారు.రాజకీయ వివాదానికి ప్రధాన కారణం ప్రభుత్వ పథకాలపై జరుగుతున్న విమర్శలే. సీఎం రేవంత్ రెడ్డి యువతులకు ఎలక్ట్రిక్ బైక్‌లు ఇస్తామని ప్రకటించి మోసం చేశారని బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు చాలా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి గతంలో ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నేతలు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. తాను గెలిస్తే ప్రతి గ్రామంలో రూపాయికే వైద్యం అందుబాటులో ఉంచుతానని, సొంత డబ్బుతో ప్రతి ఊరిలోనూ ఇళ్లు నిర్మిస్తానని ఆయన ప్రజలకు వాగ్దానం చేశారు. అయితే అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడిచినా ఆ హామీలు నెరవేర్చలేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ చర్చ ఇప్పుడు ఆర్మూర్ ప్రజల్లో పెద్ద ఎత్తున హాట్ టాపిక్‌గా మారింది. రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి.సోషల్ మీడియాలో కూడా ఈ రాజకీయ పోరు తారాస్థాయికి చేరింది. కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలు, విమర్శలతో పోస్టు పెడుతున్నారు. ఆన్‌లైన్ వేదికలపై జరుగుతున్న ఈ రచ్చ క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలను మరింత రెచ్చగొడుతోంది. అంకాపూర్ ఎమ్మెల్యే నివాసం ముట్టడి ఘటన తర్వాత ఆర్మూర్ ప్రధాన కూడళ్లలో ఉద్రిక్తత నెలకొంది. నిరసనలు, ప్రతి నిరసనలతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజకీయ నాయకుల మాటలతో కార్యకర్తలు వీధుల్లోకి రావడం, రాళ్లు రువ్వుకోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కంటే రాజకీయ కక్షలు, ప్రతీకారాలతోనే సమయం వృధా అవుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనిని నివారించేందుకు రాజకీయ పార్టీలు సంయమనం పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.పోలీసు యంత్రాంగం పరిస్థితిని గమనిస్తూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఆర్మూర్ పట్టణంలోని కీలక ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తూ, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఆందోళనలు తీవ్రతరం అవుతాయనే సమాచారంతో పోలీస్ ఉన్నతాధికారులు ఆర్మూర్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి ఊరేగింపులు, సభలు, సమావేశాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే ఇంటి వద్ద భారీగా బలగాలను ఉంచారు. ఒకవేళ పరిస్థితి చేజారితే అదనపు బలగాలను దించేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు. శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఆర్మూర్ ప్రజల్లో కొంతలో కొంత ఊరట కలిగిస్తున్నాయి. అధికార యంత్రాంగం కూడా ఈ వ్యవహారంలో చొరవ తీసుకుని రాజకీయ నాయకులతో చర్చలు జరపాల్సిన పరిస్థితి వచ్చింది.


# ప్రాథమిక ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ



**మెట్ పల్లి :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనను అందించి విద్యార్థుల్లో ప్రాథమిక భాషా, గణిత నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఈఒఔ) కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ మండలంలోని ప్రాథమిక ఉపాధ్యాయులకు మూడు రోజుల వృత్త్యంతర శిక్షణ శిబిరాన్ని సోమవారం మండల విద్యాధికారి కేతిరి దామోదర్ రెడ్డి ప్రారంభించారు.రాఘవపేట్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో మండలంలోని 59 మంది ప్రాథమిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ, విద్యారంగంలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2022 నుంచి అమలు చేస్తున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం ద్వారా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత ప్రాథమిక నైపుణ్యాలను నిర్దేశిత స్థాయికి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. ఈ శిక్షణలో నూతన బోధనా పద్ధతులు, కార్యాచరణ ఆధారిత అభ్యాసం, విద్యార్థుల అభ్యసన స్థాయుల అంచనా, బోధన–అభ్యసన సామగ్రి వినియోగం, సమర్థవంతమైన తరగతి గది నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మల్లాపూర్ మండలంలో ఈ శిక్షణను రెండు విడతలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడత జూలై 20, 21, 22 తేదీల్లో, రెండో విడత జూలై 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా రిసోర్స్ పర్సన్స్ విజయకుమార్, ప్రవీణ్ , మహేశ్ సందర్శించారు. రిసోర్స్ పర్సన్స్ గా శివకుమార్, రాజేందర్, నిరంజన్, రాజమల్లేష్ వ్యవహరించారు.ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలు మరింత మెరుగుపడి, విద్యార్థుల అభ్యసన ఫలితాలు గణనీయంగా పెరుగుతాయని మండల విద్యాధికారి కేతిరి దామోదర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## బిజినెస్

### ఎల్‌టీసీజీ పన్నును ఎత్తివేయం




**న్యూఢిల్లీ :** ఈక్విటీల్లో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడంలో భాగంగా దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను(ఎల్‌టీసీజీ)ను పూర్తిగా తొలగిం చాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్న ప్రస్తుత తరుణంలో కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను పూర్తిగా రద్దు చేసే అంశంపై ప్రస్తుతం ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని పార్లమెంట్‌కు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ సమాచారం ఇచ్చారు. 2024-25 మదింపు సంవత్సరంలో రూ. 72,249 కోట్లుగా వసూలైన ఎల్‌టీపీజీ ట్యాక్స్.. ఆ తర్వాతి సంవత్సరంలో 78 శాతం ఎగబాకి రూ.1.29 లక్షల కోట్లకు చేరుకున్నది. సాధారణంగా షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్స్‌ను దేశీయ, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 12 నెలల కంటే ఎక్కువకాలం పాటు హోల్డ్ చేస్తే వాటిని లాంగ్‌టర్మ్ అసెట్స్‌గా పరిగణిస్తారు. వీటిపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్నును వసూలు చేస్తారు.

### కుప్పకూలిన బ్లూచిప్ షేర్లు.. తీవ్ర అమ్మకాల ఒత్తిడితో 443 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



**ముంబై, జూలై 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 442.93 పాయింట్లు లేదా 0.57 శాతం కోల్పోయి 77,708.52 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 783.16 పాయింట్లు పడిపోవడం గమనార్హం. కాగా, భారీ సంస్థల షేర్లను మదుపర్లు పెద్ద ఎత్తున అమ్మేశారు. ఈ క్రమంలోనే యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల షేర్ విలువలు అత్యధికంగా 5.48 శాతం, 5.12 శాతం చొప్పున దిగజారాయి. ఇటీవలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటమే కారణమని మార్కెట్ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 95.80 పాయింట్లు లేదా 0.39 శాతం క్షీణించి 24,238.50 వద్ద నిలిచింది.

# అమెరికా, ఇరాన్ ఉద్రిక్తతలు..
# క్రూడ్ ఆయిల్ ధరలకు రెక్కలు

అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల మార్క్‌ను దాటింది. హర్మూజ్ జలసంధి (క్రాత్థుత్ శీట ఆశీతీఎబఓ) మీదుగా చమురు సరఫరాలకు అంతరాయం కలుగవచ్చనే ఆందోళనతో మార్కెట్లలో కొనుగోళ్లు పెరిగాయి. దాంతో గత రెండు రోజులుగా చమురు ధరలు వరుసగా ఎగబాకుతున్నాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర దాదాపు మూడు శాతం పెరిగి బ్యారెల్‌కు 90 డాలర్‌లు దాటింది. అంతకుముందు ట్రేడింగ్ సెషన్‌లో కూడా ఇదే స్థాయిలో పెరుగుదల నమోదైంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ కూడా 3.5 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 85.39 డాలర్ల వద్ద ట్రేడైంది. దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) లో ఆగస్టు క్రూడ్ ఫ్యూచర్స్ ధరలు కూడా జోరందుకున్నాయి.

ఉదయం ట్రేడింగ్‌లో బ్యారెల్‌కు రూ.210 పెరిగి రూ.8,120 ఇంట్రాడే గరిష్ఠస్థాయికి చేరాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావమే దేశీయ ధరలపైనా కనిపించింది. వారాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య సైనిక చర్యలు మరింత తీవ్రం కావడం మార్కెట్లను కలవరపరిచింది. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో లేదని టెహ్రాన్ ప్రకటించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసింది. వరుసగా తొమ్మిదో రోజు ఇరాన్‌లోని లక్ష్యాలపై దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. వాణిజ్య నౌకలు, పౌర నౌకలపై దాడులకు తెగబడుతున్న




ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపర్చడమే తమ లక్ష్యమని తెలిపింది. మరోవైపు హర్మూజ్ జలసంధిలో నాలుగు నౌకలను అడ్డుకున్నట్లు ఇరాన్ నౌకాదళం వెల్లడించింది. వాటిలో రెండు ప్రమాదాలకు గురికాగా, మరో రెండు వెనక్కి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో ముడిచమురు ధరలు సమీప కాలంలో బలంగానే కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

## విస్తరణ బాటలో రఘువంశీ..
## రూ 400 కోట్లు సమీకరించిన హైదరాబాదీ కంపెనీ

**హైదరాబాద్ :** హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగ సంస్థ రఘువంశీ ఏరోస్పేస్ గ్రూప్ (ఆర్‌వీఏజీ) తన విస్తరణ ప్రణాళికలకు ఊతమిస్తూ 40 మిలియన్ డాలర్లు (సుమారు రూ.400 కోట్లు) సమీకరించింది. దీనికి నార్వెస్ట్, స్కేగెన్ అసెట్ మేనేజ్‌మెంట్ నేతృత్వం వహించగా.. ఇండస్ బ్రిడ్జి వెంచర్స్, జీజేఎన్ఎక్స్ వెంచర్స్, ప్రముఖ పెట్టుబడిదారు ఆశిష్ కచోలియా పెట్టుబడులు పెట్టారు. ఈ నిధులను భారత్, యూకే, అమెరికాలోని తయారీ కేంద్రాల విస్తరణకు వినియోగించనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వంశీ వికాస్ వెల్లడించారు. అలాగే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని హార్డ్‌వేర్ పార్‌లో నిర్మిస్తున్న సమగ్ర తయారీ క్యాంపస్, మిషన్ సిస్టమ్స్, డీప్-టెక్ అండ్ అటానమస్ సిస్టమ్స్ వ్యాపారాల అభివృద్ధికి ఈ పెట్టుబడులు ఉపయోగపడనున్నాయని చెప్పారు. దాదాపు రెండు దశాబ్దాలు గా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రఘు వంశీ ఏరోస్పేస్ గ్రూప్.. ప్రస్తుతం 3 దేశాల్లో 10కిపైగా తయారీ యూనిట్లు, 1,200 మందికిపైగా ఉద్యోగులతో కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ వద్ద రూ.2,500 కోట్లకు పైగా ఆర్డర్ బుక్ ఉన్నది. హార్డ్‌వేర్ పార్ ప్రాజెక్టును వేగవంతం చేసి, స్వదేశీ మిషన్ సిస్టమ్స్, అటానమస్ సిస్టమ్స్ అభివృద్ధిపై మరింత దృష్టి సారిస్తామని ఎండీ వంశీ వికాస్ తెలిపారు. సంస్థ సీఈవో శివ అరవింద్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఐఐటీలు, ట్రిపుల్‌ఐటీలు, ఏఆర్‌సీఐ, డీఆర్‌డీఓ, ఏడీఏ వంటి ప్రముఖ




విద్యా, పరిశోధనా, రక్షణ సంస్థలతో భాగస్వామ్యాలు కొనసాగిస్తూ స్వదేశీ ఏరోస్పేస్ సాంకేతికతల అభివృద్ధికి కృషి చేస్తోందని వెల్లడించారు

# స్పెయిన్‌దే ప్రపంచ కప్..
# ఫైనల్లో మెస్సీసేనకు నిరాశ

ప్రపంచ ఫుట్‌బాల్‌లో సరికొత్త అధ్యాయం మొదలైంది. అర్జెంటీనాను మట్టికరిపిస్తూ రెండోసారి ఫిఫా వరల్డ్‌కప్‌లో గెలిచిన స్పెయిన్ సాకర్‌లో అద్వితీయ శక్తిగా మారింది. స్పెయిన్ పేరు చెప్పగానే ఆ దేశంలోని అందమైన ప్రదేశాలతో పాటు శక్తికి, ధైర్యానికి, పోరాటానికి ప్రతీకగా నిలిచే స్పానిష్ బుల్ గుర్తొస్తుంది. ఫిఫా ప్రపంచకప్‌లో స్పెయిన్ జట్టులోని ప్రతీ ఆటగాడు ఒక్కో బుల్‌లా మారారు. ఎదురైన ప్రతీ ప్రత్యర్థిని ఢీకొంటూ, చివరకు ప్రపంచకప్‌ను తమ ఖాతాలో వేసుకున్నారు. ఫైనల్లో ఆ జట్టు లియోనెల్ మెస్సీతో కూడిన అర్జెంటీనాతో తలపడటంతో అందరూ మరోసారి మెస్సీసేననే ఫేవరెట్‌గా భావించారు. కానీ మైదానంలో కనిపించింది మాత్రం భిన్నమైన దృశ్యం. 120 నిమిషాల పాటు అర్జెంటీనా ఒక్కసారి కూడా గోల్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని షాట్ కొట్టలేకపోయింది. మెస్సీకి బంతి అందిన ప్రతిసారి ముగ్గురు, నలుగురు స్పానిష్ ప్లేయర్లు చుట్టుముట్టారు. ఫైనల్లో రోడ్రి కెప్టెన్సీలోని స్పెయిన్ ఆట చూశాక ఆ జట్టు అందుకున్నది కప్పు మాత్రమే కాదు.. ప్రపంచ ఫుట్‌బాల్‌నే తన గుప్పిట్లోకి తీసుకుందని చెప్పొచ్చు.

**టికి-టాకా టు టోటల్ ఫుట్‌బాల్ దాకా**

దశాబ్ద కాలంగా స్పెయిన్ ఫుట్‌బాల్ అంటే చిన్న పాస్‌లతో బంతిని ఆధీనంలో ఉంచుకునే 'టికి-టాకా' స్టయిల్ మాత్రమే గుర్తుకొచ్చేది. 2010లో ఈ వ్యూహంతోనే ఆ జట్టు ప్రపంచకప్ గెలిచింది. కానీ, ఇప్పుడు స్పెయిన్ టీమ్‌లో మరో కోణం చేరింది. ప్రస్తుత కోచ్ లూయిస్ డి లా ఫ్యూయెంటె సాంప్రదాయ పాసింగ్ గేమ్‌కు వేగం, దూకుడును జోడించాడు. అవకాశం దొరికితే నేరుగా దాడి చేయడం.. బంతి కోల్పోతే వెంటనే తమ కంట్రోల్‌లోకి తెచ్చుకోవడం కొత్త స్పెయిన్ తీరు. వేగం, తెలివి, క్రమశిక్షణ.. ఈ మూడు కలిసి 'లా రోజా' టీమ్‌ను ప్రపంచంలోనే కంప్లీట్ టీమ్‌గా మార్చాయి.

యువ సంచలనం లామిన్ యమాల్ మెరుపు వేగంతో దూసుకెళ్తే... ఇంకో స్ట్రయికర్ నికో విలియమ్స్ ప్రత్యర్థి రక్షణను చీల్చాడు. పెడ్రి, రుయిజ్ ఆటకు అందాన్ని జోడించారు. కెప్టెన్ రోడ్రి వీటన్నింటికీ కేంద్రబిందువుగా నిలిచాడు. ఇక, ప్రత్యర్థి ఆడే విధానాన్ని మార్చేయడమే స్పెయిన్ అసలైన బలం. టెక్నికల్, టాక్టికల్ ప్లానింగ్‌తో ప్రతి క్షణాన్ని తన ఆధీనంలో ఉంచుకున్న రోడ్రిసేన తుదిపోరులో



మెస్సీ నేతృత్వంలోని అర్జెంటీనా ఎటాకింగ్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. దాంతో టోర్నీలో ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ కనీసం రెండేసి గోల్స్ చేసిన మెస్సీసేన.. ఫైనల్లో మాత్రం ఒక్కసారైనా స్పెయిన్ గోల్ పోస్ట్‌పైకి వెళ్లే సాహసం చేయలేకపోయింది.

**నాడి తెలిసిన గురువు**

2022 ప్రపంచకప్ తర్వాత లూయిస్ డి లా ఫ్యుయెంటెను స్పానిష్ టీమ్ హెడ్ కోచ్‌గా నియమించినప్పుడు చాలామంది ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఫ్యుయెంటెకు పెద్ద క్లబ్‌లకు కోచ్‌గా పనిచేసిన అనుభవం లేదు. వరల్డ్ ఫుట్‌బాల్‌లో తనకు పెద్దగా పేరూ లేదు. కానీ స్పెయిన్ ఫుట్‌బాల్ వ్యవస్థపై అతనికి పూర్తి అవగాహన ఉంది. యూత్ జట్లతో పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుత జాతీయ జట్టులోని ఆటగాళ్లలో చాలామందిని చిన్నప్పటి నుంచే తీర్చిదిద్దాడు. అదే అతడి బలంగా మారింది. 'మన ఆటను మార్చొద్దు... పరిస్థితులు ఎలా ఉన్నా ఆశలు కోల్పోవద్దు' అనే బలమైన సందేశంతో జట్టును ప్రపంచ చాంపియన్‌గా నిలబెట్టాడు.

**ఐదేండ్లలో 16 అంతర్జాతీయ టైటిళ్లు**

ఈ ప్రపంచకప్ విజయం ఒక్కసారిగా రాలేదు. గత కొన్నేళ్లుగా స్పెయిన్ పురుషుల ఆటలోనే కాకుండా. మహిళల ఫుట్‌బాల్‌లోనూ ప్రపంచాన్ని ఏలుతోంది. యూరోలు.. నేషన్స్ లీగ్‌లు.. ఒలింపిక్స్.. యూత్ ప్రపంచకప్‌లు ఇలా అన్నింటా స్పెయిన్ బుల్స్ ఆధిపత్యమే నడుస్తోంది. గత ఐదేండ్లలో అండర్-17 నుంచి సీనియర్ స్థాయి వరకు స్పానిష్ టీమ్ ఏకంగా 16 అంతర్జాతీయ టైటిళ్లను కైవసం చేసుకోవడం విశేషం. పురుషుల జట్టు వరుసగా 38 మ్యాచ్‌ల్లో ఓటమి ఎరుగకుండా దూసుకెళ్తూ ఫుట్‌బాల్ చరిత్రలోనే సుదీర్ఘ అజేయ రికార్డును నెలకొల్పింది.

**జట్టే అసలైన స్టార్**


అర్జెంటీనాకు మెస్సీ.. ఫ్రాన్స్‌కు ఎంబాపె, ఇంగ్లండ్‌కు హ్యారీకేన్, బ్రెజిల్‌కు నెయ్‌మార్, నార్వేకు హాలండ్.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతీ జట్టులో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఓ సూపర్ స్టార్ ఉన్నాడు. కానీ, స్పెయిన్ టీమ్‌లో మాత్రం అలాంటి ఒకే ఒక్క సూపర్ స్టార్ లేడు. కానీ 11 మంది స్టార్లున్నారు. ఒక్కరు తప్పు చేస్తే ఇంకొకరు కప్పిపుచ్చారు. ఒక్కరు అలసిపోతే మరొకరు పరుగులు తీశారు. ఒక్కరు గోల్ చేస్తే అంతా సంబరపడ్డారు. వ్యక్తుల కంటే జట్టే గొప్పదని స్పెయిన్ ప్రపంచానికి నిరూపించింది.

**ఫైనల్ ముగిశాక ఫైటింగ్**

ఫైనల్లో ఓడి తీవ్ర నిరాశకు గురైన అర్జెంటీనాకు మిడ్‌ఫీల్డర్ లియాండ్రొ పరెడెస్ దుందుడుకు ప్రవర్తన మరింత చెడ్డపేరు తీసుకొచ్చింది. ఆట ముగిసిన వెంటనే అతడు ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవకు దిగడమే ఇందుకు కారణం. ఆట ఆఖరి విజిల్ మోగాక సంబురాలు చేసుకుంటున్న స్పెయిన్ ప్లేయర్ల వద్దకు వెళ్లిన అతడు పలువురు ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుని వారిపై దాడి చేశాడు. ముందు స్పెయిన్ డిఫెండర్ ఎరిక్ గార్సియా వద్దకు వెళ్లి అతడిని తోసేశాడు. అనంతరం గార్సియాకు మద్దతుగా వచ్చిన సహచరుడు గావిని సైతం రెండుసార్లు కిందపడేసి అతడిపై కోపంతో ఊగిపోయాడు. అర్జెంటీనా కోచ్ స్కలోని సహా ఇతర ఆటగాళ్లు పరెడెస్‌ను అడ్డుకున్నా వినకుండా స్పెయిన్ ప్లేయర్లపై మళ్లీ దాడి చేసేందుకు యత్నించాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అయింది.

## స్పోర్ట్స్

### ఆ మసాలా ఉంటేనే మజా..
### రిటైర్మెంట్ పుకార్లపై రోహిత్ వ్యాఖ్యలు





**లండన్:** ఇంగ్లండ్‌తో రెండు వన్డేల్లో విఫలమైన వేళ తనపై వచ్చిన రిటైర్మెంట్ పుకార్లకు చెక్ పెడుతూ లార్డ్స్‌లో సత్తాచాటిన రోహిత్ శర్మ.. మూడో వన్డే అనంతరం వాటిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'దేశానికి ప్రాతినిథ్యం వహించడం, బ్యాట్‌తో జట్టుకు ఉపయోగపడేలా ఆడటమే నా పని. నా కెరీర్ ఆరంభం నుంచీ అదే చేస్తున్నా. వాటి (రిటైర్మెంట్, ఫామ్ లేమిపై వస్తున్న విమర్శలు) గురించి చాలాకాలంగా వింటున్నా. నేను ఆడుతున్నంత కాలం అవి ఉంటాయి. అవి నా ఆటను ప్రభావితం చేయలేవు. ఫీల్డ్‌లో ఆడి జట్టును గెలిపించడమే నా పని. నా దృష్టి అంతా దానిమీదే ఉంటుంది. అయినా ఇలాంటి మసాలా లేకుంటే ఆటలో మజా ఉండదు' అని హిట్‌మ్యాన్ పేర్కొన్నాడు. లార్డ్స్‌లో సెంచరీ పట్ల సంతోషం వ్యక్తం చేసిన రోహిత్.. జట్టు ఓడిపోవడం నిరాశ కల్గించిందని అన్నాడు.

### ఆల్ ఇంగ్లండ్ జూనియర్ చాంపియన్ సాయి నచికేత్




తెలంగాణ యువ షట్లర్ సాయి నచికేత్ భట్రాజు భారత బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో మెన్స్ అండర్19 టైటిల్ సొంతం చేసుకున్న దేశ తొలి ఆటగాడిగా నిలిచాడు. మెగా టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసిన టాప్ సీడ్ నచికేత్ ఫైనల్లో 21-8, 21-15తో వరుస సెట్లలో భారత్‌కే చెందిన సుహాస్‌ను చిత్తు చేసి టైటిల్ గెలిచాడు.





## ప్రభాస్ ఫౌజీ.. రెబల్ స్టార్ పవర్‌ఫుల్ రోల్..!

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఫౌజీ. ఈ మూవీకి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఇందులో ప్రభాస్ ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగా కనిపించనున్నారని తెలుస్తోంది. నేతాజీ సుభాశ్ చంద్రబోస్ నాయకత్వంలో భారత స్వాతంత్ర్యం కోసం ఆయన చేసే పోరాటమే ప్రధానంగా తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ప్రభాస్ ముందుగా బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా పనిచేసి.. ఆ తర్వాత సుభాశ్ చంద్రబోస్ నేతృత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరుతాడని తెలుస్తోంది. ఇది కేవలం నేతాజీ బయోపిక్ మాత్రమే కాదని.. అంతే కాకుండా ఇండియన్ ఫ్రీడమ్ కోసం పోరాడిన సైనికుల కథను చూపించే చిత్రంగా ఉండనుందని టాక్. ఈ మూవీలో ప్రభాస్ పాత్ర ధైర్య సాహసాలు, త్యాగం, దేశభక్తితో నిండి ఉంటుందని సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనైతే రాలేదు. ఈ చిత్రాన్ని డిసెంబరు 3న ఫౌజీ విడుదల కానుందని తాజాగా పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో ఎప్పుడు చూడని లుక్‌లో ప్రభాస్ కనిపించారు. దీంతో అభిమానుల్లో అంచనాలు పెంచేసింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ మూవీ డిసెంబర్ 3న థియేటర్లలో సందడి చేయనుంది. కాగా.. ప్రభాస్ ఫౌజీతో పాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో స్పిరిట్ చిత్రంలో కనిపించనున్నారు. ఈ మూవీలో త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆ తర్వాత సలార్: పార్ట్ 2, కల్కి 2898 ఏడీ: పార్ట్ 2 సినిమాలు చేస్తున్నారు.

# 10 రోజుల్లో అక్కినేని అఖిల్ 'లెనిన్' రికార్డు వసూళ్లు

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఈ మూవీలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. జులై 10న గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం నిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తూ అఖిల్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. లెనిన్ 10 రోజుల సక్సెస్‌ఫుల్ థియాట్రికల్ రన్‌లో వరల్డ్ వైడ్‌గా రూ.88 కోట్లు సాధించింది. ఈ విషయాన్ని మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు.

ఈ అరుదైన సందర్భాన్ని పురస్కరించుకుని ఇవాళ సాయంత్రం లెనిన్ టీం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేయనుంది. ఈవెంట్‌కు అక్కినేని నాగచైతన్య చీఫ్ గెస్ట్‌గా రాబోతున్నాడు. ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మించారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీ రోల్స్‌లో నటించారు. ఈశ్వరీరావ్, బ్రహ్మాజీ, ప్రమోద్ పంజు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్ అందించాడు. లెనిన్ థియాట్రికల్ రన్ తర్వాత జీ5 ఓటీటీ ప్లాట్‌ఫాంలో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది






## అర్థం చేసుకోకుండా కామెంట్స్ చేస్తారు..

### నెట్టింట నెగెటివిటీపై రకుల్ ప్రీత్ సింగ్

తెలుగు, తమిళం, హిందీ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ రకుల్ ప్రీత్ సింగ్. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ భామ అప్పుడప్పుడు నెటిజన్లు, అభిమానులతో తన అభిప్రాయాలను షేర్ చేసుకుంటుంది. తాజాగా సోషల్ మీడియాలో పెరుగుతున్న నెగెటివిటీ గురించి మాట్లాడింది. సోషల్ మీడియా అనేది కొందరు జనాలు ముక్కుమొఖం తెలియని అకౌంట్లతో తరచూ కఠిన వ్యాఖ్యలు చేస్తూ నెగెటివిటీని ప్రచారం చేసే హబ్‌లాంటిది. చాలా మంది వ్యక్తులు అజ్ఞాత ప్రొఫైల్స్‌తో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. వారు చేస్తున్నకామెంట్ల ప్రభావం ఎలా ఉంటుందో కనీసం అర్థం చేసుకోరని చెప్పింది. అందరినీ మెప్పించడం అసాధ్యమన్న రకుల్ ప్రీత్ సింగ్ సెలబ్రిటీలు ఆన్‌లైన్‌లో వచ్చే అనవసరమైన ట్రోల్స్, విమర్శల వల్ల తమ ఫోకస్ మార్చుకోకూడదు. నెగెటివిటీని ఎదుర్కొనేందుకు వాటిని పట్టించుకోకుండా వ్యక్తిగత, వృత్తి పరమైన లక్ష్యాలపైన దృష్టి పెట్టడమే ఉత్తమ మార్గమని చెప్పుకొచ్చింది. ఇండియన్ 2 సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన రకుల్ ప్రీత్ సింగ్.. స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం రణ్ బీర్ కపూర్ నటిస్తోన్న రామాయణలో కీలక పాత్రలో నటిస్తోంది. రకుల్ నటించిన ౹ఖఅ౹ఖఅఱ చాబతీ ఔశీప్త్ర ఇశీ ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఈ భామ నెక్ట్స్ ఇండియన్ 3 చేయాల్సి ఉంది. మరి తెలుగు సినిమాలో ఎప్పుడు కనిపిస్తుందో చూడాలి.

## అల్లు అర్జున్ 'రాకా' టీంలోకి మరో భామ.. ఇంతకీ పాత్ర ఏంటో మరి..?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్టు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న ' చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.



## 'కొరియన్ కనకరాజు' కొత్త సాంగ్ రిలీజ్

మెగాహీరోల్లో వరుణ్ తేజ్ ఒకడు. ముకుంద, ఫిదా, తొలిప్రేమ, కంచె లాంటి సినిమాలతో కెరీర్ ప్రారంభంలో సమ్‌థింగ్ డిఫరెంట్ అనిపించుకున్నాడు. తర్వాత నుంచి వరసపెట్టి ఫ్లాప్స్ పడ్డాయి. 2019లో వచ్చిన 'గద్దలకొండ గణేశ్' ఓ మాదిరిగా ఆకట్టుకోగా.. తర్వాత వచ్చిన గని, గాండీవదారి అర్జున, ఆపరేషన్ వాలంటైన్, మాట్కా చిత్రాలు ఒకదానిని మించి మరొకటి డిజాస్టర్స్ అయ్యాయి. దీంతో రెండేళ్లు గ్యాప్ తర్వాత వరుణ్ తేజ్ నుంచి వస్తున్న సినిమా 'కొరియన్ కనకరాజు'. వచ్చే నెల 7న థియేటర్లలో రిలీజ్ కానుంది. వారం క్రితం టీజర్ రిలీజ్ చేయగా పర్లేదనిపించుకుంది. ఈ క్రమంలోనే ఇప్పుడు 'రసగుమ్మడి' అంటూ ఓ పాట వదిలారు. విలేజ్ స్టైల్లో సాగే మాస్ బీట్‌తో ఉన్న ఈ గీతం కలర్‌ఫుల్‌గా బాగుంది. తమన్ మ్యూజిక్ వినసొంపుగా ఉంది. ఇకపోతే ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకుడు. రితికా నాయక్ హీరోయిన్.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967